
# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 45 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 06 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 45 06-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-

నేపాల్‌లో స్వల్ప భూకంపం.. 3లో





## మోదీకి శ్రీలంక అత్యున్నత పురస్కారం

# ‘శ్రీలంక మిత్ర విభూషణ’

### ప్రధాని మోదీకి అందజేసిన అధ్యక్షుడు అనుర కుమార

### మూడు రోజుల పర్యటన కోసం శ్రీలంక వెళ్లిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


భారత ప్రధాని నరేంద్ర మోదీకి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని అందజేసింది. ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే తమ దేశం మిత్ర దేశాధినేతలకు ఇచ్చే అత్యున్నత పురస్కారం ‘శ్రీలంక మిత్ర విభూషణ’ను అందజేశారు. దీనిలోని ధర్మ చక్రం ఇరు దేశాల సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మధ్యలో ఉండే కలశం శ్రేయస్సును, తొమ్మిది విలువైన రత్నాలు ఇరు దేశాల మధ్య శాశ్వతమైన స్నేహాన్ని సూచిస్తే... సూర్యుడు, చంద్రుడు కాలాతీత బంధానికి సూచిక. ఇలా ఇవన్నీ ఇరు దేశాల మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాన్ని సూచిస్తాయి. కాగా, ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన కోసం శ్రీలంక వెళ్లిన విషయం తెలిసిందే.

# క్షణ క్షణం.. భయం..భయం

## పలు దేశాల్లో కంపిస్తోన్న భూమి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు నమోదవుతున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన భూకంపనలు శనివారం ఉదయం కూడా కొనసాగాయి. జపాన్ లో గత 24 గంటల్లో 4సార్లు భూమి కంపించగా, తాజాగా శనివారం ఉదయం పలు దేశాల్లో స్వల్ప ప్రకంపనలు సంభవించాయి. ఉత్తర భారతంలోనూ భూ ప్రకంపనలు రికార్డవుతున్నాయి. అటు, నేపాల్‌ను శుక్రవారం సాయంత్రం స్వల్ప భూకంపం వణికించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.0 గా




- వార్త 2లో..

# ఇప్పుడు దేశంలో జనాభా పెరగడం చాలా అవసరం

- పిల్లలు లేకపోతే.. ఊళ్లే ఉండవు -
- లేకపోతే, రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని ఆందోళన
- సీఎం చంద్రబాబు
- నందిగామ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన

నందిగామ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉమ్మడి కృష్ణా జిల్లా నందిగామ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అప్పట్లో పరిస్థితుల దృష్ట్యా కుటుంబ నియంత్రణ పాటించమన్నామని, ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో దేశంలో జనాభా పెరగాల్సి అవసరం చాలా ఉందని అన్నారు. లేకపోతే, రాబోయే రోజుల్లో దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పుడు ఇదే సమస్యగా ఉందని తెలిపారు. వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉండే దేశాల్లో ఉత్పాదకత తగ్గిపోతుంటుందని వివరించారు. జనాభా వృద్ధి చెందడం అత్యంత ముఖ్యమైన అంశం అని స్పష్టం చేశారు. దేశంలో రెండో తరం సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి పోయింది!**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. గత ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరించి రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి పోయింది. నాయకుడు విధ్వంసం సృష్టిస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోయింది. నాయకుడు దూరదృష్టితో ఆలోచిస్తేనే సమాజం బాగుంటుంది. అప్పట్లో నేను ఐటీ రంగాన్ని ప్రోత్సహించాను. ఇప్పుడు తెలుగువారు ప్రపంచంలోని ప్రతీ దేశంలో సత్తా చాటుతున్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటివారు మన పిల్లలు. బాగా చదివిస్తే ప్రపంచాన్ని ఏలుతారు. ఇప్పుడు ఏపీలో సంపద సృష్టించే ప్రయత్నం చేస్తున్నాం. సంపదను సృష్టించి అందరికీ పంచుతాం. అట్టడుగున ఉన్న 25 శాతం మంది పేదల కోసమే పీ4 తీసుకువచ్చాం... అని చంద్రబాబు వివరించారు.

**పిల్లలు లేకపోతే.. ఊళ్లే ఉండవు - సీఎం చంద్రబాబు**

ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ల పర్యటనలో పాల్గొన్న సీఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జనాభా

- తరువాయి 2లో..





## బాబు జగ్జీవన్‌రామ్‌కి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు



అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భారత మాజీ ఉప రాష్ట్రపతి డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు

- తరువాయి 2లో..



# 8న అనంత జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన


అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైఎస్ జగన్ అనంతపురం జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 8వ తేదీన ఆయన పాపిరెడ్డిపల్లి గ్రామానికి వస్తారని మాజీ ఎమ్మెల్సీ వేంపల్లి సతీష్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో పరిటాల వర్గీయుల చేతిలో ఉగాది నాడు వైసీపీ కార్యకర్త లింగమయ్య దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన వైఎస్ జగన్ బాధిత కుటుంబంతో ఫోన్‌లో మాట్లాడారు.

**న్యాయపరమైన సాయం అందిస్తామని భరోసా**

తమకు ప్రాణహాని ఉందని లింగమయ్య కుటుంబ సభ్యులు జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వాళ్లకు ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని, అవసరమైతే న్యాయపరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో త్వరలో వచ్చి కలుస్తానంటూ మాట ఇచ్చారు. వైఎస్ జగన్ పర్యటన వేళ.. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వైసీపీ కీలక నేతలు ఇవాళ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ వేంపల్లి సతీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శంకర్ నారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.





## పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దు

- షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం చేరుకోవాల్సిన పవన్
- సీతారాముల కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలను సమర్పించాల్సిన డిప్యూటీ సీఎం
- పర్యటన రద్దు చేసుకున్నట్టు తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీకి సమాచారం

అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దయింది. రేపు శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారి కళ్యాణానికి పవన్ హాజరు కావాల్సి ఉంది. హైదరాబాద్ లోని నివాసం నుంచి రోడ్డు మార్గంలో సాయంత్రం 5 గంటలకు ఆయన భద్రాచలం చేరుకోవాల్సి ఉంది. రాత్రి భద్రాచలంలో బస చేసి, రేపు స్వామి వారి కళ్యాణానికి హాజరై ఏపీ ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలను సీతారాములకి సమర్పించాల్సి ఉంది. అయితే పవన్ పర్యటన రద్దు అయినట్టు తెలంగాణ

- తరువాయి 2లో..




## భద్రాద్రి కొత్తగూడెం పోలీసుల ఎదుట లొంగిపోయిన

# 86 మంది మావోయిస్టులు

- మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో లొంగుబాటు
- లొంగిపోయిన వారికి రూ. 25 వేల చెక్కు అందజేత
- ఇటీవల కాలంలో 203 మంది మావోయిస్టుల లొంగుబాటు
- ప్రభుత్వ సహాయం అందుకోవాలని ఐజీ పిలుపు

భద్రాద్రికొత్తగూడెం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ప్రయత్నాలు ఫలించాయి. మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ‘ఆపరేషన్ చేయూత’ ఫలితాలను ఇస్తోంది. ఈ ఆపరేషన్ నేపథ్యంలో, ఏకంగా 86 మంది మావోయిస్టులు

- తరువాయి 2లో..

## పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై మాజీ ఎంపీపై కేసు నమోదు

అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




పాస్టర్ ప్రవీణ్ పగడాల గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే, క్రిస్టియన్ సంఘాలు ఆయన మృతిపై అనుమానం వ్యక్తం చేశాయి. ఎవరో ప్రవీణ్‌ను చంపేసి ఉంటారని, నిందితులను పోలీసులు పట్టుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంపై స్పందించిన సీఎం చంద్రబాబు సమగ్ర విచారణ జరిపి, నిజనిజాలు తేల్చాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ ఎంపీ హర్ష కుమార్... పాస్టర్ ప్రవీణ్ మృతిపై

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## ఈ సుంకాలతో లాభనష్టాలు

భారత్ ఎగుమతులపై అమెరికా 26 శాతం దిగుమతి సుంకాన్ని విధించడం ఆర్థిక ఆందో ళనలకు దారి తీసింది. భారత్‌తో పోల్చిన ప్పుడు అధికంగా చైనాపై 40%-%60 శాతం (కొన్ని ఉత్పత్తులపై 100 శాతం వరకు), వియత్నాంపై 30%-%45 శాతం, థాయ్‌లాండ్‌పై 35%-%50 శాతం దిగుమతి సుంకాలను అమె రికా విధించింది. భారత్‌కన్నా తక్కువగా యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం, జపాన్‌పై 24 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం దిగుమతి సుంకాలను అమెరికా విధించింది.

**అమెరికా వాదన**

2024లో అమెరికాకు సంబంధించి భారత్ ఎగుమతుల విలువ 91.23 బిలియన్ డాలర్లు. భారత్ మొత్తం ఎగుమతుల విలువలో అమెరికా వాటా 18 శాతం. ఇదే సంవత్సరం అమెరికా ఉత్పత్తుల దిగుమతులలో భారత్ వాటా 2.6 శాతం. మొత్తంగా భారత్‌తో వాణి జ్యానికి సంబంధించి అమెరికా వాణిజ్య లోటు 2023%-%24లో 45.7 బిలియన్ డాలర్లు కాగా, 2024%-%25 (జనవరి వరకు) 22.9 బిలియన్ డాలర్లుగా నమోదయింది.

అమెరికాకు సంబంధించిన పాసింజర్ వాహనాలపై 70 శాతం, యాపిల్స్‌పై 50 శాతం, ఆల్కహాల్‌పై 100 %-%150 శాతం దిగుమతి సుంకాలను భారత్ విధిస్తున్నప్పుడు, ప్రస్తుతం భారత్‌పై అమెరికా విధించిన 26 శాతం దిగుమతి సుంకం సమంజసమేనని అమెరికా వాదిస్తున్నది. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య నియమావళికి విరుద్ధంగా భారత్ వ్యవహరిస్తున్నదని అమెరికా భావిస్తున్నది.

దిగుమతి సుంకాల పెంపు కారణంగా బీఎస్‌ఈ సెన్సెక్స్, నిఫ్టీ 50తో పాటు చైనా, థాయ్‌లాండ్‌కు సంబంధించిన ముఖ్య సూచీల లోనూ క్షీణత ఏర్పడింది. 2023%-%24లో అమెరికాతో వాణిజ్యంలో చైనా మార్కెట్ వాటా 21.6 శాతం కాగా, వియత్నాం వాటా 19.3 శాతంగా, భారత్ వాటా 6 శాతంగా నిలిచింది. వివిధ దేశాలపై అమె రికా దిగుమతి సుంకాల పెంపు కారణంగా చైనా, వియత్నాంలతో పోల్చినప్పుడు భారత్ ఎగుమతులలో పోటీతత్వం పెరుగుతుందని భావించవచ్చు.

సగటు అమెరికా దిగుమతి సుంకాల కారణంగా%-% భారత్‌లో రొయ్యలు, వస్త్రాలు, స్టీల్ రంగాలపైబీ చైనాలో సోలార్ పానల్స్, సెమీ కండక్టర్, స్టీల్, ఎలక్ట్రిక్ వాహనాలపైబీ వియత్నాంలో ఫుట్‌వేర్, ఎల క్ట్రానిక్స్, ఫర్నీచర్‌పైబీ థాయ్‌లాండ్‌లో ఆటో పరికరాలు, రబ్బరు ఉత్పత్తులపై ప్రభావం ఉంటుందని అంచనా.

**భారత్‌పై ప్రభావం**

ప్రాథమిక కేటగిరీకి సంబంధించిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరిక రాలు, ఫార్మా ఉత్పత్తులు, విలువైన రాళ్ళు భారత్ నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. మార్చి 2025లో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకొనే చర్యలో భాగంగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై భారత్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం వలన రెండు దేశాలకు పరస్పర ప్రయోజనం చేకూరుతుంది. ఆసియా ఖండంలోని ఇతర దేశాలతో పోల్చినప్పుడు సౌరవిద్యుత్, ఫార్మాసూటికల్స్, టెక్స్‌టైల్స్ %-% అప్పారెల్ రంగాలలో భారత్‌కు అధిక ప్రయోజనం ఉంటుందని అంచనా.

ప్రపంచవ్యాప్తంగా టెక్స్‌టైల్ %-% అప్పారెల్ రంగాలకు సంబంధించి పోటీ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుత దిగు మతి సుంకాల నిర్ణయం కారణంగా అమెరికా మార్కెట్‌లో ఆ యా ఉత్పత్తులకు సంబంధించి భారత్‌కు పోటీ తగ్గుతుంది. చైనాకుసంబంధించిన సౌర ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకం కారణంగా చైనా సౌర ఉత్పత్తుల ధరలు పెరగడం వలన భారత్‌కు ప్రయోజనం చేకూరుతుంది. చైనాపై అమెరికా అధికంగా ఆధార పడటం తగ్గి భారత్ %-% అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత పటిష్ఠమయ్యే అవకాశం ఉంది.

భారత్ నుండి రొయ్యల ఎగుమతుల విలువ రూ. 22,000 కోట్లు కాగా, ఈ మొత్తంలో అమెరికా వాటా 44 శాతంగా ఉంది. ప్రస్తుతం అధిక సుంకాల కారణంగా భారత్ నుండి అమెరికా రొయ్యల ఎగుమతుల విలువలో తగ్గుదల ఏర్పడవచ్చు. భారత్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులకు సంబంధించి అమెరికాలో భారత్ మార్కెట్ వాటా తగ్గుతుంది. వజ్రాలు, ఆభరణాల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. భారత్‌లో అనేక సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు హ్యాండిక్రాఫ్ట్ గార్మెంట్స్ ఎగుమ తులపై అధికంగా ఆధారపడ్డాయి. అధిక సుంకాల నేపథ్యంలోఎం.ఎస్.ఎం.ఇ. సంస్థల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. తద్వారా ఆ యా సంస్థలలో లే ఆఫ్ కారణంగా ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గుతుంది.

**సిద్ధించే ప్రయోజనాలు**

అమెరికా దిగుమతి సుంకాలను ముఖ్యంగా వస్తువులపై విధించినందువలన భారత్‌లో పటిష్ఠంగా ఉన్న ఐటీ, సేవల రంగంపై ఈ ప్రభావం ధనాత్మకంగా ఉంటుంది. భారత్ నుండి సాఫ్ట్‌వేర్ సర్వీ సులు, ఫైనాన్షియల్ టెక్నాలజీ, బిజినెస్ అవుట్ సోర్సింగ్‌కు సంబంధించి ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ వస్తువులకు సంబంధించి భారత్‌తో పోల్చినప్పుడు చైనా, యూరప్‌లపై అధిక సుంకాలు విధించిన కారణంగా అమెరికా కొనుగోలుదారులు భారత్ ఇంజినీరింగ్ ఉత్పత్తులపై దృష్టి సారించే వీలుంది. దానివల్ల భారత్ ఎగుమతులలో పెరుగుదల ఏర్పడుతుంది. చైనా ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాల కారణంగా బహుళ జాతి సంస్థలు తమ ఉత్పత్తిని భారత్‌లో చేపట్టే అవకాశం ఉంది. తద్వారా భారత్ అధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే అవ కాశం ఉంటుంది. భారత్‌లో ఇప్పటికే అమలులో ఉన్న 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెన్టివ్ స్కీమ్' (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం) కారణంగా ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, సెమీ కండక్టర్‌లకు సంబంధించిన సంస్థలు భారత్‌లో అధికంగా ఏర్పాటవుతాయి. తద్వారా భార త్‌లో పెట్టుబడులు, ఉపాధి, ఉత్పత్తి, ఎగుమతుల విలువలో పెరుగు దల కనబడుతుంది. అది స్థూల దేశీయోత్పత్తిలో కూడా పెరుగు దలగా ప్రతిఫలిస్తుంది.

అమెరికా దిగుమతి సుంకాల కారణంగా ఇతర దేశాల వ్యవ సాయ ఉత్పత్తుల ధరలలో పెరుగుదల ఏర్పడుతుంది. తద్వారా భారత్ నుండి బియ్యం, సుగంధ ద్రవ్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు అమెరికా మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతోపాటు భారత్ ఎగుమతుల విలువలో పెరుగుదల ఏర్పడుతుంది. ఎగుమతుల పరంగా ఇబ్బంది ఎదుర్కొనే నేపథ్యంలో (కొన్ని ఉత్పత్తులకు సంబంధించి) భారత్ లోని ఉత్పత్తి స్వదేశీ డిమాండ్‌ను తీర్చడానికి ఉపకరిస్తుంది. ఈ స్థితి దేశంలో కొన్ని ఉత్పత్తుల కొరతను నివారించడం ద్వారా సాధారణ ధరల స్థాయి తగ్గుదలకు దారితీస్తుంది.

**చేయాల్సింది**

అయితే, అమెరికా ఆటో పరికరాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలనే ఒత్తిడిని భారత్ సమీప భవిష్యత్తులో ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందుకే అమెరికాపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించు కోవాలి. ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆగ్నేయాసియా దేశాలతో భారత్ నూతన వాణిజ్య భాగస్వామ్యాన్ని

# 30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే లక్ష్యంగా మెప్మా ప్రణాళిక..

**▸▸ విజయవాడలో మెప్మా వన్ డే వర్క్ షాప్**

**అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




విజయవాడలో మెప్మా వన్ డే వర్క్ షాప్ నిర్వహించారు. మహిళాకాశం పేరిట మెప్మా వెబ్ సైట్, మెప్మా మొబైల్ యాప్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు. మహిళా వ్యాపారుల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక లక్ష్యంతో వర్క్ షాప్ నిర్వహించారు. వన్ డే వర్క్ షాప్ కి మెప్మా డైరెక్టర్ తేజ భరత్, మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే లక్ష్యంగా మెప్మా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఉన్న పదివేల జీవనోపాధి యూనిట్లతో పాటు కొత్తగా 20 వేల జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసేందుకు మెప్మా ప్రణాళిక రూపొందించింది. తొమ్మిది రకాల జీవనోపాధి యూనిట్లను రూపొందించింది. మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ఇన్ని సంవత్సరాల తరువాత కూడా డ్వాక్రా సంఘాలు, మెప్మా డేటాను పర్ఫెక్ట్ గా ఉంచుకున్నారు.. ప్రభుత్వం నుంచి ఏం ఇవ్వాలన్నా డేటా పర్ఫెక్ట్ గా ఉండాలి.. ఈ రోజు ఐదు వెబ్‌సైట్ లు ప్రారంభించాం.. 2047 నాటికి ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త వుండాలని సీఎం చంద్రబాబు లక్ష్యం.. గతంలో ఇసుక కాంట్రాక్టులు డ్వాక్రా గ్రూపులకు ఇచ్చారు.. కొన్ని అనివార్య కారణాలవల్ల అది అమలు జరుగలేదు.. 80 వేల సంఘాలకు 8 కోట్లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నాం.. 26 జిల్లాలలో మీటింగ్ లు పెట్టాలని అనుకుంటున్నాం.. 2029 నాటికి సాధ్యమైనంత మేరకు మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

# పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన వేళ ఉద్రిక్తత

**కాకినాడ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జనసేన ఎమ్మెల్సీ నాగబాబు శనివారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. ఈక్రమంలో %ా%. టిడిపి, జనసేన కార్యకర్తల మధ్య ఘర్షణ రాజుకొని తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. నాగబాబు పర్యటిస్తుండగా %ా% జై వర్మ అంటూ టిడిపి వర్గీయులు పసుపు జెండాలతో నినాదాలు చేశారు. దీన్ని జనసేన కార్యకర్తలు అడ్డుపడ్డారు. ఈ క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పిఠాపురంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సీటు త్యాగం చేసి మరీ పవన్ కల్యాణ్‌ను గెలిపించారని, అలాంటి వ్యక్తిని జనసేన ఆవిర్భావ సభలో నాగబాబు తక్కువ చేసి మాట్లాడారని టిడిపి శ్రేణులు, వర్మ అనుచరులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానికంగా వర్మకు రాజకీయ ప్రాధాన్యత తగ్గిపోయిందని, దీని వెనక కూడా నాగబాబు కుట్ర ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిన్న గొల్లప్రోలులోనూ అన్నాక్యాంటీన్ ప్రారంభ కార్యక్రమంలోనూ గందరగోళం ఏర్పడింది. తాజాగా కుమారపురంలోనూ వర్మకు మద్దతుగా నినాదాలు చేస్తూ నాగబాబు పర్యటనను అడ్డుకునే ప్రయత్నం జరిగింది.



# మొదటి పేజీ నుంచి

## క్షణ క్షణం.భయం భయం

నమోదైంది. గరా?కోట్‌కు మూడు కి.మీ దూరంలో 20కి.మీ లోతులో భూకంప కేంద్రం రికార్డయ్యింది. ఈ ప్రభావంతో ఉత్తర భారతంలోనూ పలు ప్రాంతాల్లో కొన్ని సెకండ్లపాటు భూమి కంపించింది. నేపాల్‌లో శుక్రవారం సాయంత్రం గం. 7.52 సమయంలో ప్రకంపనలు రికార్డయినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఆ సమయంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు.. పపువా న్యూ గినియాలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.9గా నమోదు అయింది. పశ్చిమ న్యూ బ్రిటన్ ప్రావిన్స్‌లోని కింబే పట్టణానికి 194 కి.మీ దూరంలో భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. 10 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు.

## బాబు జగ్జీవన్‌రామ్‌కి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు

అందించారని కొనియాడారు. ఈ మేరకు సోషల్ మాధ్యమంలో సీఎం చంద్రబాబు ఓ ట్వీట్ చేశారు. తన జీవితమంతా సమసమాజ స్థాపన కోసం కృషిచేసిన బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తిగా మనందరం బడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జగ్జీవన్ రామ్ ఆశించిన సమాజాన్ని నిర్మిద్దామని సీఎం చంద్రబాబు తెలిపారు.

**దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి**

ఇక, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ఓ ట్వీట్ చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు నిరుపమానవని అభివర్ణించారు. దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎనలేని కృషిచేశారని ఉద్ఘాటించారు.

**అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడాలి**

మరోవైపు భారతదేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చాలా గొప్పవని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ నివాళి అర్పించారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడారని తెలిపారు. వారి హక్కుల కోసం ఆయన జీవితాంతం సాగించిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రధాని మోడీ కొనియాడారు.

## పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దు

ఇంటెలిజెన్స్ డీజీకి సమాచారం అందింది. తన పర్యటన వల్ల భక్తులకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో పవన్ తన పర్యటనను రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, ఈ నెల 11న ఒంటిమిట్టలో కోదండరాములవారి కళ్యాణోత్సవం జరగనుంది. ఏపీ ప్రభుత్వం తరపున స్వామివారికి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు.

## ఇప్పుడు దేశంలో జనాభా పెరగడం చాలా అవసరం

పెంపు అవసరంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన అభిప్రాయం ప్రకారం, భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాలు జనాభా లేక క్షీణతకు లోనవుతాయని హెచ్చరించారు. "దంపతులు ఇద్దరికి మించి పిల్లలను కలిగి ఉండాలి. అప్పుడే గ్రామాలు, సమాజం సుస్థిరంగా కొనసాగగలుగుతాయి" అని స్పష్టం చేశారు.

**2035 నాటికి జనాభా తగ్గుదలపై హెచ్చరిక**

ప్రస్తుత జననాల రేటును బట్టి చూస్తే, 2035 నాటికి జనాభా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని సీఎం తెలిపారు. ఆ సమయంలో గ్రామాల్లో చిన్నపిల్లలు లేరు, యువత తక్కువగా ఉంటుంది. అధిక సంఖ్యలో వృద్ధులు మాత్రమే మిగిలి ఉంటారని చెప్పారు. ఇది సమాజానికి తీవ్రమైన సమస్యగా మారే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు.

**గ్రామాల్లో జీవన శైలిపై ప్రభావం**

జనాభా తగ్గుదల వల్ల గ్రామాల్లో సాంప్రదాయ జీవన విధానం దెబ్బతింటుందని, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగడం కష్టమవుతుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. యువత లేకపోతే గ్రామాల అభివృద్ధి అడ్డంకులకు గురవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన శక్తిని నిలబెట్టేందుకు కుటుంబాల విస్తరణ అవసరమని హితవు పలికారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నడవాలి**

రాష్ట్ర అభివృద్ధి కొనసాగించాలంటే ప్రజలు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. పిల్లల సంఖ్యపై ఆలోచన చేయాల్సిన సమయం వచ్చిందని, సమాజపు సుస్థిరతకు ఇది ముఖ్యమని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

## భద్రాద్రి కొత్తగూడెం పోలీసుల ఎదుట లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు

పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన మావోయిస్టులు కూడా ఉన్నారు. లొంగిపోయిన వారిలో 20 మంది మహిళా మావోయిస్టులు, 66 మంది పురుషులు ఉన్నారు. గత నాలుగు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 66 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, తాజాగా 86 మంది లొంగిపోయారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకంగా 25 వేల రూపాయల చెక్కును ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... మావోయిస్టులు అజ్ఞాత జీవితాన్ని విడిచిపెట్టి, సాధారణ జీవితంలోకి రావాలని కోరారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ములుగు జిల్లా ఎస్పీ శబరీష్, ఇతర పోలీస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మావోయిస్టుల పేరుతో అమాయక ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై ఇటీవల కాలంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అంతేకాకుండా, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి మావోయిస్టుల కార్యకలాపాలు అడ్డుగా ఉన్నాయని గుర్తించి, వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా గత నాలుగు నెలల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు.

## పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై మాజీ ఎంపీపై కేసు నమోదు

సంచలన ఆరోపణలు చేశారు. ఆయనను ఎక్కడో చంపేసి, రోడ్డు పక్కన విసిరేయడం ద్వారా రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందన్నారు. పోలీసులు ఈ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనికి సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. మాజీ ఎంపీ వ్యాఖ్యలపై స్పందించిన పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలతో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, హర్ష కుమార్ పోలీసుల విచారణకు హాజరుకాలేదు. పైగా మరోసారి అవే వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. దాంతో పోలీసులు ఇవాళ ఆయనపై కేసు నమోదు చేశారు. పాస్టర్ మృతి కేసులో తప్పుడు ఆరోపణలు చేశారంటూ మాజీ ఎంపీపై బీఎన్ఎస్ సెక్షన్ 196, 197 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసులపై హర్ష కుమార్ స్పందిస్తూ, మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు.





## సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు



**నందిగామ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని, పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి ముప్పాళ్ల వెళ్లిన సీఎం చంద్రబాబు గురుకుల పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల అంతా కలియదిరిగారు. వంటశాల, భోజనశాలలో పరిశుభ్రతను పరిశీలించారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా, నాణ్యతతో అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి సీఎం తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని అడిగారు. అనంతరం డార్మెటరీని పరిశీలించారు.




# నేపాల్‌లో స్వల్ప భూకంపం..

## ఉత్తర భారతంలో ప్రకంపనలు


- రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో నేపాల్‌లో భూకంపం
- గర్హ్వాకోట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో 20కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం
- ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో పలుచోట్ల ప్రకంపనలు



నేపాల్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 5.0 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. గరా?కోట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో, 20 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ రోజు సాయంత్రం గం.7.52 నిమిషాలకు ఇది సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూకంపం ఉత్తర భారతదేశాన్ని కూడా తాకింది. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో పలుచోట్ల భూప్రకంపనలు సంభవించాయి. వారం రోజుల క్రితం మయన్మార్‌లో రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మయన్మార్‌లో 3,000 మందికి పైగా మృతి చెందగా, 4,500 మందికి పైగా గాయపడ్డారు. మరో 341 మంది కనిపించకుండా పోయారు.

## ముఖ్యమంత్రి పిలుపుతో పీ4కి అనూహ్య స్పందన

### -ప్రసాద్ ఔదార్యాన్ని అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అట్టడుగున ఉన్న పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తలపెట్టిన పీ4 కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి పిలుపు మేరకు... పేదలకు చేయూతను అందించేలా పీ4 కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు సంపన్నవర్గాలు ముందుకొస్తున్నాయి. ఇప్పటికే పలువురు పారిశ్రామిక వేత్తలు మార్గదర్శకులుగా ఉండి.. బంగారు కుటుంబాలకు సాయంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఏకంగా సొంత నిధులతో ఒక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మించి ఇవ్వడానికి గుంటూరు జిల్లాలో ఒక పారిశ్రామిక వేత్త ముందుకు వచ్చారు. గుంటూరు జిల్లా కాకమాను మండలంలో రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమ్మమూరు కెనాల్ ద్వారా నీటి సౌకర్యం ఉన్నా... చివరి భూములకు నీరు అందడం లేదు. ఇక్కడ లిఫ్ట్ నిర్మిస్తే ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరతాయి. దీంతో ఈ సమస్యను పరిష్కరించడానికి పి4పై సిఎం ఇచ్చిన పిలుపును అందుకుని ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ ముందుకు వచ్చారు. తమ సొంతూరులో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడం ప్రముఖ విత్తన తయారీ సంస్థ 'ప్రసాద్ సీడ్స్' యాజమాన్యాన్ని కదిలించింది. సమస్య పరిష్కారం కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వంతో భాగస్వాములు అవుతామని ఈ మేరకు ప్రసాద్ సీడ్స్ చైర్మన్ కారుమంచి ప్రసాద్ ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణానికి రూ.10 కోట్లు వితరణ ఇస్తామని చెప్పారు. తద్వారా తమ సొంతూరు కాకుమాను గ్రామంతో పాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కారుమంచి ప్రసాద్ సూచించిన విధంగా కొమ్మమూరు ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు డీపీఆర్ సిద్ధం చేసి, త్వరగా అనుమతులు ఇవ్వాలని జలవనరుల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రసాద్ అందించే ఆర్థిక సాయం ద్వారా లిఫ్ట్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. సొంత గ్రామంలో రైతులకు మేలు చేసేందుకు పెద్దమనసుతో ప్రసాద్ ముందుకు రావడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. తాను ఏ ఆలోచనతో అయితే పి4 విధానాన్ని ప్రకటించానో.... దాన్ని అర్థం చేసుకుని వివిధ వర్గాల ప్రజలు ముందుకు రావడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందని సిఎం అభిప్రాయపడ్డారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను గ్రామానికి చెందిన కారుమంచి ప్రసాద్ 4 దశాబ్దాలుగా విత్తన వ్యాపారంలో ఉన్నారు. 1995 నుంచి ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన సహాయం చేస్తూ వస్తున్నారు. పెదనందిపాడు లిఫ్ట్ స్కీంను పూర్తి చేయడానికి 1995లో ఆయన ఆర్థిక సాయం అందించారు. 43 కి.మీ పొడవున్న కొమ్మమూరు కాలువలో చివరి 10 కి.మీ. మేర భూములకు ఎన్నాళ్లగానో సాగునీరు సరిగ్గా అందడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి కాకమాను దగ్గర కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ను నిర్మించాల్సి ఉంది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాకారమైతే కాకమాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొండపాతూరు గ్రామాల్లోని సుమారు 5,315 ఎకరాలకు పుష్కళంగా నీరు అందుతుంది. అలాగే కాకమాను మండలంలో ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి 10 కి.మీ. పొడవునా చివరి ఆయకట్టు వరకు 100 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా 100 అడుగుల వెడల్పుతో కాలువ అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా ఈ ప్రాజెక్టుకు సాయం చేసేందుకు ప్రసాద్ ముందుకు రావడంతో ప్రభుత్వం కూడా అవసరమైన నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయనుంది.

## పపువా న్యూగినియాలో భారీ భూకంపం..

### సునామీ హెచ్చరిక జారీ





ఓషియానా కంట్రీల్లో ఒకటైన పపువా న్యూ గినియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 6.9గా నమోదైంది. పశ్చిమ న్యూ బ్రిటన్ ప్రావిన్స్‌లోని కింబే పట్టణానికి 194 కిలోమీటర్ల దూరంలో, భూమికి 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీంతో అమెరికా జియోలాజికల్ సర్వే సునామీ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, ఇటీవల మయన్మార్, థాయిలాండ్‌లలో 7.7 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం వేలాది మందిని బలితీసుకుంది. ఒక్క మయన్మార్‌లోనే మూడు వేలమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేలమంది గాయపడగా, మరికొందరు గల్లంతయ్యారు. ప్రస్తుతం అక్కడ సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# ముస్లిం మహిళలకు స్వేచ్ఛను ఇచ్చిన మోదీ ప్రభుత్వం

## -బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి

**విజయవాడ, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారతదేశంలో అనేక విప్లవాత్మకమైన మార్పులను మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ తీసుకు వచ్చారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ముప్పై ఏళ్లుగా ఆయన మంత్రిగా పని చేస్తూ ప్రజలకు సేవలు అందించారని అన్నారు. ఇప్పుడు ఉన్న పీడీఎస్ వ్యవస్థను జగజ్జీవన్ రామ్ ప్రారంభించారని గుర్తుచేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, మధుకర్, షేక్ బాజీ, ఇతర నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడారు. జగజ్జీవన్ రామ్ బాల్యం నుంచి ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. పాఠశాల స్థాయిలోనే వివక్షను ఎదుర్కొని అవమానాలకు గురయ్యారని చెప్పారు. కులాల వారీగా సమాజాన్ని విభజించడం సరికాదని బాల్యంలోనే చైతన్యాన్ని నిరూపించుకున్నారని అన్నారు. కళాశాల స్థాయిలో కూడా ఏదోక పోరాటం చేస్తూనే ఉన్నారని తెలిపారు. 40 ఏళ్ల పాటు పార్లమెంటేరీయన్‌గా ఉండటం చాలా గొప్ప విషయమని దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు.

1977లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి జనతాలో చేరారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. దేశానికి ఆయన అందించిన సేవలను అందరూ స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఎన్డీఏ కూటమి కేంద్రంలో ఎస్సీ కులాల అభ్యున్నతి కోసం చాలా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మహిళల పేరుతో ఇళ్లు కేటాయిస్తున్నారని చెప్పారు. చదువుల్లో ముందుకు వెళ్లేలా ఎస్సీ, ఎస్టీ కులాల వారికి స్కాలర్ షిప్‌లు అందిస్తున్నారని అన్నారు. స్టార్ట్ అప్ ఇండియా, స్టాండప్ ఇండియా కార్యక్రమాలను ప్రధానమంత్రి మోదీ తీసుకు వచ్చారని తెలిపారు. యువతను పారిశ్రామిక వేత్తలకు తీర్చిదిద్ది, పది మందికి ఉపాధి కల్పించేలా చేశారని అన్నారు. డి.ఐ.సి.సి.ఐ (డిక్కీ) అనే పారిశ్రామిక సంస్థను దళితుల అభ్యున్నతి కోసం అమల్లోకి తీసుకు వచ్చారని చెప్పారు. బాబూ జగజ్జీవన్ రామ్ సేవలను ఆదర్శంగా తీసుకుని మోదీ అనేక పథకాలను అమల్లోకి తెచ్చారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.

అసాధ్యాన్ని సుసాధ్యాన్ని చేసే నాయకత్వం బీజేపీకి ఉందని ప్రజలకు సగర్వంగా చెబుతున్నానని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మన సైనికులను హతమారుస్తున్న సమయంలో పొరుగు దేశంలోకి వెళ్లి ఉగ్రవాద సంస్థలను హతమార్చారని అన్నారు. జమ్ము కాశ్మీర్ భారతదేశంలో అంతర్ భాగం అని చెప్పారని గుర్తుచేశారు. శరణార్థులుగా వచ్చిన వారికి సిటిజన్ షిప్ ఇచ్చి ఆశ్రయం కల్పించారని ఉద్ఘాటించారు. 500 సంవత్సరాల బారతీయుల కల రామమందిరం నిర్మాణాన్ని నిజం చేశారని తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను తొలగించి ముస్లిం మహిళలకు స్వేచ్ఛను ఇచ్చారని చెప్పారు. మోదీ సారథ్యంలో ఎన్డీఏ కూటమి అసాధ్యాలను సుసాధ్యం చేసిందని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లును కూడా లోక్ సభ, రాజ్యసభల్లో ఆమోదించారని తెలిపారు. ముస్లింల గురించి అందరూ మాట్లాడటమే తప్ప.. వారి క్షేమం కోసం చేసిన ఘనత మోదీదేదని.. అయితే రాష్ట్రపతి ఈ బిల్లును త్వరలో



ఆమోదిస్తారని భావిస్తున్నామని అన్నారు. చట్ట రూపంలో అమల్లోకి వచ్చాక.. ఫలితాలను అందరూ చూస్తారని తెలిపారు. సరైన చర్చ జరగకుండా ఈ చట్టం చేశారని సోనియా తమపై అపవాదు వేశారని దగ్గుబాటి పురందేశ్వరి చెప్పుకొచ్చారు.

ధార్మిక కార్యక్రమాలకు ఎవరైనా భూమి ఇస్తే అది వక్ఫ్ ఆస్తులు అవుతాయని దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. ఇచ్చిన భూములను ఉద్దేశించిన కార్యక్రమానికి నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించడానికి వక్ఫ్ బోర్డు వచ్చిందని తెలిపారు. వక్ఫ్ బోర్డు నిర్వహించే బాధ్యతల్లో ఇంకా సమర్ధవతంగా చేయడానికి మార్పులు చేశారని అన్నారు. మతపరమైన అంశాల్లో ఎక్కడా మార్పులు చేయలేదు.. తల దూర్చలేదని తేల్చిచెప్పారు. భక్తుల కోసం ఇచ్చిన భూములను సరిగా వినియోగిస్తున్నారా లేదా అనేది సరి చేయడానికి మార్పులు చేశారన్నారు. 2013 సంవత్సరంలో ఎన్నికలకు కొన్ని నెలలు ముందు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ యాక్ట్‌ను సవరణ చేశారని అన్నారు. మైనార్టీ బోర్డును డైల్యూట్ చేసి.. కావాల్సిన వారు బోర్డులు పెట్టుకోవచ్చని మైనార్టీల్లో విభజన తెచ్చారన్నారు. 2013లో యూపీఏ ప్రభుత్వం ఆనాడు ఓటు బ్యాంకు రాజకీయాలు చేసిందని విమర్శించారు. వక్ఫ్ భూమిగా పరిగణిస్తే.. ఇక దానిని ఎవరూ ప్రశ్నించడానికి లేదు.. వక్ఫ్ ఆస్తిగా తీసుకోవడమేనని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా తొమ్మిదన్నర లక్షల ఎకరాల భూమి వక్ఫ్ కింద ఉందని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తు చేశారు.

ఈ చర్చ జరిగినప్పుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సభలో ఉన్నారా అని దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు అభిప్రాయాలు చెప్పాక పార్లమెంట్‌లో తెల్లవారుజామున మూడు గంటలకు బిల్లు ఆమోదం పొందిందని గుర్తు చేశారు. రాజ్యసభలో మరునాడు తెల్లవారుజామున నాలుగు గంటలకు బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. మరి వారు సభలో లేకుండా వీటిపై అభిప్రాయాలను ఎలా వ్యక్తం చేశారని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందుకు పంపాలని అందరూ చెప్పారన్నారు. నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల వారి అభిప్రాయలను సేకరించారని తెలిపారు. 25 రాష్ట్రాల నుంచి వక్ఫ్ బోర్డుల నుంచి జాయింట్ పార్లమెంట్ కమిటీకి తమ అభిప్రాయాలను వివరించారని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు అందరి ఆమోదంతోనే జరిగిందని.. అయినా కొంతమంది రాజకీయం చేస్తున్నారని దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు.

ఇండియన్ రైల్వే, డిఫెన్స్ తర్వాత వక్ఫ్ దగ్గరే భూమి ఎక్కువగా ఉందని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. వక్ఫ్ ఆదాయం మాత్రం రూ. 163 కోట్లు అంటే నవ్వుతారని చెప్పారు. ముస్లింల్లో వెనుకబాటు తనం నిర్ధారించేందుకు రాజేంద్రసచార్ కమిటీ నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. వక్ఫ్‌కు ఉన్న ఆస్తులను సద్వినియోగం చేసుకోకలిగితే.. ర.16వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆ కమిటీ చెప్పిందన్నారు. నిజంగా వక్ఫ్ భూములను సద్వినియోగం చేస్తే.. మైనార్టీల్లో పేదరికం అనేది ఉండదని చెప్పారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో.. ఈ భూములను ఇష్టం వచ్చినట్లుగా ఇచ్చి.. కొంతమంది మాత్రమే బాగుపడుతున్నారని తెలిపారు. నిబద్ధతతో పని చేయడం లేదని స్పష్టత వచ్చాకే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చారని అన్నారు. వక్ఫ్ బోర్డులో మహిళలకు అసలు ప్రాతినిథ్యం లేదని చెప్పారు. ముస్లిం మైనార్టీలో వెనుకబడిన వారికి వక్ఫ్ బోర్డులో ప్రాతినిధ్యం లేదని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. వీరందరికీ ఇప్పుడు సవరణ బిల్లు ద్వారా ప్రాతినిధ్యం కల్పించాం.. తప్పు ఎలా అవుతుందని దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. రాజకీయ లబ్ధికోసం ముస్లింల జీవితాలతో ఆడుకున్న పార్టీలకు మీరే బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. బీజేపీ ముస్లింలకు ఎప్పుడూ వ్యతిరేకం కాదు.. మీ సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ అని తెలిపారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేసినా.. మీకోసం పథకాలు అమలు చేసింది బీజేపీనే అని గుర్తుచేశారు. వైసీపీ లోక్‌సభలో సవరణ బిల్లుకు సపోర్టు చేయమని చెప్పి.. రాజ్యసభలో విప్ ఇచ్చి మరీ మద్దతు ఇచ్చారని చెప్పారు. వైసీపీది పూర్తిగా ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. బీజేపీ మాత్రం ముస్లింల సంక్షేమానికి, అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ఏప్రిల్ 6 వ తేదీ బీజేపీ ఆవిర్భావ దినోత్సవమని తెలిపారు. రేపు అన్ని ప్రాంతాలలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ప్రతి బీజేపీ కార్యకర్త పార్టీ సేవకు, దేశ సేవకు అంకితం అయ్యే రోజుగా పరిగణించాలని దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు.

# బాబు జగజ్జీవన్ రామ్ స్పూర్తితో ముందుకు సాగాలి

## జాయింట్ కలెక్టర్ నిషాంతి - కలెక్టరేట్ లో ఘనంగా 117వ జయంతి



**అమలాపురం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అణగారిన వర్గాల అభ్యుదయం, హక్కుల కోసం అంటరానితనాన్ని రూపుమాపేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన బాబూ జగజ్జీవన్ రామ్ ఆశయాలను, జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి పిలుపునిచ్చారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ లో బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి జేసి నిషాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని సమతా దివస్ వేడుకలు నిర్వహించామన్నారు. ఆనాటి సమాజంలోని ప్రజలందరి సమానత్వం కోసం నిరంతరం ఆయన శ్రమించారని సమకాలీన వ్యవస్థలో సమూలమైన మార్పుల కోసం, అణగారిన వర్గాల పట్ల వేళ్లూనుకొని ఉన్న వివక్షతను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడన్నారు. 27 ఏళ్లకే శాసనమండలి సభ్యునిగా ఎన్నికై రికార్డు సృష్టించిన ప్రజా నాయకుడని స్వాతంత్ర సమరయోధుడని పొలిటికల్ కింగ్ మేకర్ అని రాజకీయాల్లో రాణించి అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పని చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతమని అన్నారు. ఎనిమిది సార్లు పార్లమెంట్ సభ్యుడిగా వరుసగా ఎంపికయ్యారని ఏకధాటిగా సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన ఎన్నో సేవలు అందించి ప్రగతిశీలిగా ప్రత్యేకత చాటారన్నారు. డిఆర్ఓ రాజకుమారి మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ తన నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో 30 సంవత్సరాల పాటు కేంద్రంలో వివిధ హోదాల్లో, పలుశాఖల్లో మంత్రిగా పని చేశారని, ఆ సమయంలో ఆయన ఏ పదవి చేపట్టినా కూడా ఉన్నతమైన ఆశయంతో పనిచేసి తన పదవులకే వన్నె తెచ్చారని గుర్తు చేసారు. సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి. జ్యోతిలక్ష్మి దేవి మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ ఆహార కొరతను తీర్చడానికి హరిత విప్లవం కార్యక్రమాన్ని సఫలీకృతం చేశారన్నా రు. దళిత నేత జంగా బాబురావు మాట్లాడుతూ ఆయన చూపిన బాటలోనే నేటి యువతరం నడవాలని తద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చునన్నారు. మరొక నేత సి.రామారావు మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ పార్లమెంట్ సభ్యుడిగా, క్యాబినెట్ మంత్రిగా ప్రపంచ రికార్డు సాధించారన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత దేశానికి తొలి కార్మికమంత్రిగా పని చేసి ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.వి.వి.ఆర్.రాజు, ఎల్.డి ఎం.కేశవ వర్మ, డి ఎం అండ్ హెచ్ ఓ ఎం.దుర్గారావు దొర, డిటిఓ రామనాథం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిశేషు, కలెక్టరేట్ ఏవో కె.కాశీ విశ్వేశ్వరరావు, ఎస్.డి.సి కృష్ణమూర్తి, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





## బీసీ సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

**మలికిపురం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద జరపతలపెట్టిన బీసీ సమరభేరి పోస్టర్ లను రాజోలు నియోజకవర్గం అధ్యక్షులు ఆకుమర్తి భూషణం శనివారం మలికిపురం పూలే అంబేద్కర్ భవనం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే ఆలోచనలను అందుకున్నప్పుడే ఈ దేశ సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని అన్నారు. బీసీల సమస్యలేఈ దేశ సమస్యలని,విద్య,ఉద్యోగ,రాజకీయాలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన అన్నారు. తదనుగుణంగా సమగ్ర కులగలన జరపాలని,ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ బత్తుల లక్ష్మణరావు,రాష్ట్ర బీసీ సమైక్య సాధికార అధ్యక్షులు గుబ్బల బాబ్జి,మలికిపురం మండల ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు గెడ్డం ఫిలిప్ రాజు,నల్లి శివ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి భూషి జాన్ మోషే,మలికిపురం మండల అధ్యక్షులు మోకా శ్రీనుబాబు,రాజోలు మండల అధ్యక్షులు పట్నాల సత్య నారాయణ,సఖినేటిపల్లి మండల అధ్యక్షులు నల్లి రాజ్ కుమార్,మామిడి కుదురు మండల ఉపాధ్యక్షులు పెదపూడి రవి,తెన్నేటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి భారీ విరాళం

**ఐ.పోలవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



:ఐ పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి శనివారం భక్తుడు భారీ విరాళం అందించారు. విజయవాడ చెందిన కూనపరెడ్డి శ్రీనివాసరావు దీప్తిలి దంపతులు రు 100116(ఒక లక్ష నూట పదహార్లు) శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి విరాళం ఆలయ పర్యవేక్షణ అధికారికి శ్రీనివాసరాజు కి అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో దాతలు ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

## స్వాతంత్ర్య సమరయోధులు బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం.

**-ఎస్డిపిఓ సుంకర మురళీమోహన్.**



**కొత్తపేట ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్వాతంత్ర్య సమర యోధులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కొత్తపేట సబ్ డివిజన్ పోలిస్ కార్యాలయం నందు ఎస్డిపిఓ సుంకర మురళీమోహన్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలవేసి ఘణంగా నివాళులు అర్పించి వారిని స్మరించుకున్నారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాం ఏప్రిల్ 5, 1908 న బీహారు రాష్ట్రంలో జన్మించారని, ఈయన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. బీహార్ లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో జగ్జీవన్‌రామ్ చురుగ్గా పాల్గొన్నారు. బీహార్‌లో గొప్ప ప్రజా ఉద్యమాన్ని నడిపాడు. జగ్జీవన్‌రామ్ ఈ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వ అరాచకాలను, అణచివేతల్ని ఖండిస్తూ దేశ స్వాతంత్ర్య సాధనకోసం అనేక సభా, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వత భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా కూడా మన భారత దేశానికి సేవలందించారు. ఇలాంటి స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు.

## బాబూ జగజ్జీవన్ రాం జయంతి నివాళు లు అర్పించిన ఎమ్మెల్యే సత్యానందరావు.

**కొత్తపేట, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




)
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రాం జయంతి సందర్భంగా కొత్తపేటలోని జగజ్జీవన్ రాం విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ రాం చేసిన సేవలను కొనియాడారు. ఈ కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, విల్లా మారుతీ, రాజకుమార్ వాడయార్, ధరణాల రామకృష్ణ, బీర ఇస్సాక్, దేవపాటి వెంకటేశ్వరరావు, నల్ల రమణ, పల్లికొండ సుధీర్, ముద్రగడ సుబ్బారావు, బండి రాజు, కముజు శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే అయితాబత్తుల ఘన నివాళి

**అమలాపురం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్వర్గీయ శ్రీ బాబూ జగజ్జీవన్ రామ్ గారి జయంతి సందర్భంగా పేరూరు మరియు ఇమ్మిడివరప్పాడు గ్రామాలలో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి , మాజీ %ఎజూజూ% బొర్రా ఈశ్వరరావు, దేవరపల్లి వీరేష్ కుమార్, మంథా ఫణి, మంద గెద్దయ్య, దాసరి అరుణకుమారి, ఆకుమార్తి రమేష్, ముత్తాబత్తుల సత్యనారాయణ మరియు తదితరులు



## ఊబలంకలో బాబు జగజ్జీవన్ రామ్, అంబేద్కర్ గార్ల విగ్రహావిష్కరణ చేసిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి.





**రావులపాలెం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో ఏర్పాటుచేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ 117వ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి శు భాకాంక్షలు తెలియజేసారు. సమాజానికి రెండు కళ్ళుగా బాబు జగజ్జీవన్ రావ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నారన్నారు. అంటరానితనం తరిమి కొట్టడంలో నడుం బిగించి జగజ్జీవన్ రావ్, అంబేద్కర్ ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, చిర్ల అభిమానులు పాల్గొన్నారు.

## ప్రతాప్ కు సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేష్ సత్కారం

**సఖినేటిపల్లి, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రపదేశ్ ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడు చే కళారత్న ( హంస) పురస్కారాన్ని అందుకున్న మండలానికి చెందిన ప్రముఖ కవి , రచయిత, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సి.ఈ.ఓ డా. కత్తిమండ ప్రతాప్ ను రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక , సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు . రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో ప్రతాప్ ను దుశ్శాశాలువ తో సత్కరించి ఫోటో ఫ్రేమ్ అందచేసారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు . శ్రీ శ్రీ కళావేదిక ద్వారా ప్రతాప్ నిరంతరం చేస్తున్న సాహితీ సేవలను కొనియాడారు .




## ఘనంగా డాన్ బోస్కో ప్రిపరేటరీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే

**రావులపాలెం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండల కేంద్రం రావులపాలెంలో ఎంతో మంది ప్రముఖులను తయారుచేసిన విద్యా సంస్థ ఏదైనా ఉంది అంటే అది డాన్ బోస్కో స్కూల్ అని రావులపాలెం జాన్ కార్టర్ మినిస్ట్రీస్ డైరెక్టర్, యాళ్ల శ్యాంసుందర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం డాన్ బోస్కో ప్రిపరెటరీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నేటి పిల్లలు ఇంట్లోనే తుపాకీ కన్నా ప్రమాదకరమైన సెల్ ఫోన్ లతో గడుపుతున్నారని, వాటికి దూరంగా ఉంచకపోతే రేడియేషన్ కు గురికాక తప్పదని, సెల్ కు బానిస ఐతే భవిష్యత్తు ప్రమాదంకు దారి తీస్తుందని వారు హెచ్చరించారు. రావులపాలెం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అచ్చుతాంబా విలువలు, క్రమశిక్షణ తో కలిగిన విద్యను అందించడం లో డాన్ బోస్కో స్కూల్ కీలక పాత్ర వహిస్తుంది అనడం లో సందేహం లేదు అని పేర్కొన్నారు. తదుపరి వీరి చేతులు మీదుగా గ్రాడ్యుయేట్ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్న పిల్లలు చేసే నృత్యరూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో డాన్ బోస్కో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ బాల్తాజర్, రావులపాలెం ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ గురవయ్య నాయుడు, ప్రిపేరటరీ స్కూల్ హెడ్ మిస్ట్రీస్ సిస్టర్ జెస్సి, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంశ్య గ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి

ఏలూరు ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన డా. బాబు జగజ్జీవన్ రామ్ నేటి తరానికి ఆదర్శనీయులని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. డా. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తో కలిసి స్థానిక ఓవర్ బ్రిడ్జ్ వద్ద డా. బాబు జగజ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డా. బాబు జగజ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని, సమాజంలో అంటరానితనం, ,సామజిక అసమానతలు రూపుమాపేందుకు అలుపెరగని కృషి చేశారన్నారు. అటువంటి నాయకులను స్మరించుకుని వారి జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ డా. బాబు జగజ్జీవన్ రామ్ పేదల సంక్షేమానికి కృషిచేశారన్నారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు తన జీవితాన్ని అంకితం చేసారని, వారు చూపిన బాటలో నేటి యువత నడిచి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్, మైనారిటీల సంక్షేమ శాఖాధికారి ఎన్ .ఎస్. కృపావరం, షెడ్యూల్డ్ కులాల సంఘాల నాయకులు పొలిమేర హరికృష్ణ, మెండెం సంతోష్ కుమార్, దాసరి ఆంజనేయులు, మేతర అజేయబాబు, కలపాల రవి, నేతల రమేష్ బాబు, ధనియాల శంకర్, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



రాజమహేంద్రవరం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ ఉప ప్రధాని, భారతరత్న బాబూ జగజ్జీవన్ రావమ్ రాజకీయ నాయకుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, మంత్రిగా కాకుండా ఒక సంఘ సంస్కర్తగా సమాజ అభివృద్ధికి ఎంతో కృషి చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక జాంపేట చర్చిగేట్ సెంటర్‌లో ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎస్పీ నరసింహా కిషోర్, జెసి చిన్న రాముడు, సంఘాల ప్రతినిధులతో కలిసి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు ఆకాంక్షించే వ్యక్తిగా బాబు జగజ్జీవన్ రామ్ చేసిన కృషిని కొనసాగిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలవాలని పిలుపు ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు ఆశయ సాధన కోసం చిత్తశుద్ధి కలిగిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేయారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి , సామాజిక అసమానతులు అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దళితులు అందరూ ఐక్యత గా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పిలుపు ఇచ్చారు. సమాజంలో ఉన్న సామాజిక అసమానతలను తొలిగే వరకు కలిసి కట్టుగా ఉండి రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఎస్పీ డి నరసింహా కిషోర్ మాట్లాడుతూ ఎంతో కష్ట పడితే మనకు స్వతంత్రం వచ్చిందని, దానిని కాపాడుకోవడం మన చేతుల్లో ఉంది అన్నారు. జగజ్జీవన్ వంటి నాయకుల అడుగులో అడుగులు వేస్తూ, రాజ్యాంగాన్ని పరిరక్షణా భాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేసి ఎస్ చిన్న రాముడు, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తి బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎమ్ఎస్ శోభారాణి, ఆర్ఎమ్‌సి సిటీ ప్లానర్ జి కోటయ్య, స్థానిక కుల సంఘాల ప్రతినిధులు వెంట్రపాటి వీర్రాజు, రెడ్డి మనేశ్వర రావు, తాళ్లూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దొండపాటి క్రిష్టాఫర్ , పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చీరలను పంపిణి చేశారు.

## గీతాయజ్ఞం రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలు ప్రారంభం

భీమవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భీమవరం ఆనంద పంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనందరాజు పౌండేషన్ ఆధ్వర్యంలో ఆనంద గీతా యజ్ఞం రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలను ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. రెండురోజులపాటు జరిగి పోటీలను శనివారం ప్రారంభించారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 4 విభాగాల్లో నిర్వహించారు. మొదటి విభాగం సబ్ జూనియర్స్ (5 నుంచి 10 సంవత్సరం వయసు) 21 నుంచి 30 శ్లోకాలు, రెండో విభాగం జూనియర్స్ ( 11 నుంచి 18 సంవత్సరం వయసు) 51 నుంచి 70 శ్లోకాలు, మూడో విభాగం సీనియర్స్ (19 సంవత్సరం వయసు పైన) 76 నుంచి 108 శ్లోకాలు, నాలుగో విభాగం విశిష్ట ప్రతిభా విభాగం అన్ని వయసుల వారికి మొత్తం 108 శ్లోకాలపై పోటీలను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 1000 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఏ విభాగానికి ఆ విభాగం చొప్పున పోటోలను నిర్వహించారు. చైర్మన్ కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ రెండురోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని, గెలుపొందిన వారికి 13న ఆనందరాజు వర్ధంతి సభలో ప్రముఖుల సమక్షంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. పోటీల్లోని విజేతలకు ప్రతి విభాగంలోని ప్రథమ రూ 5 వేలు, ద్వితీయ రూ 3 వేలు, తృతీయ రూ 2 వేలు, కన్సోలేషన్ రూ వెయ్యి, 108 శ్లోకాల పోటీల్లో విజేతలకు ప్రథమ రూ 6 వేలు, ద్వితీయ రూ 4 వేలు, తృతీయ రూ 2 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందిస్తామని, పాల్గొన్న వారందరికి ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాయన చంద్రజీ, కంతేటి వెంకటరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రవీణ్‌ది హత్యా?.. ప్రమాదమా? వెల్లడిరచాలి

### పోస్టు మార్టం రిపోర్టు వెల్లడిలో జాప్యం ఎందుకు?
### మాజీ ఎంపి జివి హర్ష కుమార్

రాజమహేంద్రవరం ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతి హత్యా?... ప్రమాదమా అన్నది ప్రభుత్వం త్వరగా తేల్చి చెప్పాలని అమలాపురం మాజీ ఎంపి జివి హర్షకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలోని సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ మరణించి నేటికి 14 రోజులు పూర్తి అయ్యాయని, ఇప్పటికీ రిపోర్టును వెల్లడిరచకుండా జాప్యం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోస్టుమార్టం రిపోర్టు నివేదిక ఎందుకు ఆలస్యం అవుతోందో పోలీసులు, ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రవీణ్ మృతిలో అనేక సందేహాలు ఉన్నాయన్నారు. పోస్టు మార్టం రిపోర్టు వెల్లడిస్తే అందులో ఏమైన తేడా వస్తే తాను ఎక్కడ కోర్టుకు వెళతానోననే భయంతోనే పోస్టు మార్టం రిపోర్టు వెల్లడిరచడం లేదన్నారు. ఎపి పోలీసులపై ప్రవీణ్ భార్యకు నమ్మకం ఉంటే ఉండొచ్చని తమకు మాత్రం నమ్మకం లేదన్నారు. ప్రవీణ్ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ప్రజలకు సమాచారం ఇవ్వాలి అన్నారు. తనపై కేసులు పెడుతున్న పోలీసులు ఫేక్ వీడియోలు విడుదల చేస్తున్న ఆ వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోరు.....? అని ప్రశ్నించారు. కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు అన్నీ కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టాలి అన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి రీపోస్టుమార్టం చేయాలి కోరుతే తనపై బిఎన్ఎస్ 196, 197 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు అన్నారు. రీ పోస్టుమార్టంకు ఎన్‌వోసి అడుగుతూ తాను పెట్టుకున్న విజ్ఞాపనకు కలెక్టర్ నుండి ఎలనాలెడ్జ్‌మెంట్ వచ్చిందని, ఎస్పీ నుండి ఇంకా రాలేదన్నారు.

## తోలేరులో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భారతదేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చాలా గొప్పవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం తోలేరు పంచాయతీ కొండేపట్ల చెరువు వద్ద శనివారం భారత ఉప ప్రధానమంత్రిగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. అణగారిన వర్గాల కోసం బాబూ జగ్జీవన్ రామ్ పోరాటం చేశారని, వారి హక్కుల కోసం ఆయన జీవితాంతం సాగించిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. తన జీవితమంతా సమసమాజ స్థాపన కోసం కృషిచేసిన బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తిగా మనందరం బడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## జ్యూయలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు శుభ పరిణామం

### భీమవరంలో వేగ జ్యూయలరీ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణంలో జ్యూయలరీ ఎగ్జిబిషన్ ను రెండురోజులపాటు నిర్వహించడం శుభ పరిణామమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పాల్కన్ నెస్ట్ హెటల్లో శనివారం వేగ జ్యూయలరీ ఆధ్వర్యంలో హాఫ్ శారీ అండ్ వెడ్డింగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్ ను ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఒకే చోట ఎన్నో రకాల ఆభరణాలను మహిళలకు అందుబాటులోకి తీసుకోవడంపై వేగ జ్యూయలరీ వారిని ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. వేగ జ్యూయలరీ మేనేజర్ బాల దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ సింహాచలం, మార్కెటింగ్ మేనేజర్ విజయ్ మాట్లాడుతూ రెండురోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, మహిళలకు మెచ్చే అన్ని రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచామని అన్నారు. లక్కీ డ్రా విన్నర్ కు గోల్డ్ కాయిన్ బహుమతిగా అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బండి రమేష్ కుమార్, అశోక్, నసీమా తదితరులు పాల్గొన్నారు.

## భీమవరం బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



భీమవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం బులియన్ అసోసియేషన్ 2025- 27 కుగాను నూతన కార్యవరాన్ని ఎన్నుకున్నారు. శనివారం భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా కోట్ల నాని ఉపాధ్యక్షులు కారుమూరి కిరణ్, పున్నం శ్రీనివాసరావు, కార్యదర్శి వబిలిశెట్టి పార్థసారథి, సహాయ కార్యదర్శులు కనగర్ల విజయ రామకృష్ణ, బొండాడ నాగభూషణం, కోశాధికారి బొండా రామకృష్ణరావు (రాంబాబు)లు ఎన్నికైనట్లు తాత్కాలిక అధ్యక్షులు వబిలిశెట్టి పట్టాభిరామయ్య తెలిపారు. ఎన్నికైన సభ్యులను మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు, పలువురు సభ్యులు అభినందించారు.

## మల్లెపూలతో బాల త్రిపుర సుందరి అమ్మవారికి అలంకరణ



భీమవరం, ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వసంత నవరాత్రులను పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి మల్లెపూలతో అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతలు మిండకుదురు వీర వెంకట సత్యనారాయణ త్రిమూర్తులు ప్రభాకర్ (బ్యాటరీ మూర్తి), లక్ష్మి దంపతుల సహకారంతో ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, శ్రీచక్రార్చన, కుంకుమార్చన, నక్షత్ర హారతులు, నీరాజన మంత్ర పుష్పాలతో పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మద్దాల సాయిబాబు, రత్నకుమారి దంపతులచే కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం మల్లెపూలతో అమ్మవారికి పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, బాలాత్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్‌కు నివాళి

కాకినాడ ఏప్రిల్ 06 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ఇంద్రపాలెం సెంటర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, శాసనమండలి సభ్యులు పేరబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణం, పెద్దాపురం శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చిన్నరాజప్ప, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా అధికారులు హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె. విజయ కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి జేడీ ఎస్.శ్రీనివాసురావు, బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, వివిధ ప్రజాసంఘాలు నాయుకులు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# మంచి ఆలోచనాపరులు బాబూ జగ్జీవన్ రామ్

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవు
- 117వ జయంతి సందర్భంగా నివాళులు
- నగరంలో సొంత ఖర్చులతో రెండు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటు... ప్రారంభం
- 49వ డివిజన్లో రూ. 10 లక్షలతో బాబూ జగ్జీవన్ రామ్ స్మారక భవనం ప్రారంభం



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు మంచి ఆలోచనపరులు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. 49వ డివిజన్లో రూ. 10 లక్షలతో నిర్మించిన బాబూ జగ్జీవన్ రామ్ స్మారక భవనం, అలాగే 14వ డివిజన్ శారదా నగర్ వాటర్ ట్యాంకుల వద్ద, 31వ డివిజన్ చింతలపేటలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం 49వ డివిజన్లో టీడీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షులు రాచపల్లి ప్రసాద్ అధ్యక్షతన, 49వ డివిజన్ ఇంచార్జ్ దుత్తరపు గంగాధర్ పర్యవేక్షణ, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల చిన్న రాజు సారధ్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటి అలాగే భవిష్యత్తు తరాలకు బాబూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ వారి గురించి తెలియాలన్నారు. అలా తెలియాలి అంటే ఇలాంటి విగ్రహాలు, స్మారక భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. వీరిద్దరూ మనందరి వారని అన్నారు. త్వరలో రెండు అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వారి సేవలు భవిష్యత్తు తరాలకు తెలియాలన్నారు. డివిజన్లోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ గురించి చెబుతూ ఆయన చదువుకున్న పాఠశాలలోనే మొదటిసారిగా అంటరానితనాన్ని అనుభవించారని అన్నారు. ఆయన అనుభవాలే ఆయన దళిత జనుల జాగృతివైపు ముందుకు సాగడానికి ప్రేరణనిచ్చాయన్నారు. జగ్జీవన్ రామ్ జీవిత కాలంలో ఎన్నో అవమానాలు, ఆటంకాలు ఎదుర్కొని సమాజాన్ని ప్రభావితం చేయగలిగారని, అంతటి కష్టకాలంలో కేవలం 27 ఏళ్ల వయస్సులోనే శాసన మండలి సభ్యునిగా ఎన్నిక కావడం ఆయనకే చెల్లిందని, 52 ఏళ్లపాటు పార్లమెంటును ఏలిన మహా అనుభవ శీలి అని, వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య, రైల్వేశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. విద్యార్థి దశలోనే గాంధీజీ అహింసా మార్గానికి ఆకర్షితుడు అయి 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పోలీసులను ఎదిరించి లాఠీ దెబ్బలకు బెదరకుండా నిలబడ్డ నాటి స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. వివక్షను ఎదుర్కొంటూ ఉపప్రధాని స్థాయికి రావడం జగ్జీవన్రామ్ అకుంఠిత దీక్ష, పట్టుదల, క్రమశిక్షణ అని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన 1986 జూలై 6న పరమపదించారన్నారు. దళితుల హక్కులను రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిస్తే వాటిని చట్ట రూపంలో అమలుచేయడానికి జగ్జీవన్రామ్ చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిదని, అవమానాలు, ఆటంకాలను విజయాలుగా మలుచుకున్న నిజమైన దేశ నాయకుడు జగ్జీవన్రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు..



**కాకినాడ, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శనివారం ఉదయం మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఎల్. చెంచి రెడ్డి, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి.లు బి. రామకృష్ణ ,రవి కుమార్, ఇన్స్పెక్టర్ ఏ. శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్టమొదటిసారిగా కాకినాడ జిల్లాకు విచ్చేసిన గౌరవ శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు శుక్రవారం సాయంత్రం కాకినాడ పట్టణం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలత జిల్లా కలెక్టర్ దంపతులు, ఎస్పీ బిందు మాధవ్ ఎమ్మెల్సీ నాగబాబు కు స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ నాగబాబు వెంట రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, పిఠాపురం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు ఉన్నారు.

# సప్పా రచనకు పురస్కారం

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



నాట్య కళారంగంలో రాజమహేంద్ర వరంరానికి అంతర్జాతీయ ఖ్యాతి నందించిన ఋషి తుల్యులు, నాట్యంలోనేగాక, బహు గ్రంథ రచయితగా విఖ్యాతిపొందిన డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ రచించిన "ప్రీ వెడ్డింగ్ షుట్"అనే కథకు ఈ ఏటి ఉత్తమ కథా పురస్కారం లభించింది.నిహారిక ఫౌండేషన్ గుంటూరులో శనివారం నిర్వహించిన సభలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత కొనకలూరి ఇనాక్ చేతుల మీదుగా పురస్కారంగా రూ.3 వేల నగదు, జ్ఞాపిక,పండిత శాలువా సప్పా దుర్గాప్రసాద్ అందుకున్నారు.వేదికపై గుదిబండ వెంకటరెడ్డి (హైదరాబాద్),విడదల సాంబశివరావు,కొసరాజు సామ్రాజ్యం,సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు,కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తదితర ప్రముఖులు ప్రసంగించారు.సప్పా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కథా రచయితగా పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తంచేశారు.సప్పా అభిమానులు దేశ విదేశాల నుంచి అభినందన సందేశాలు అందించడం విశేషం.

# ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

**అండర్-15,అండర్- 20 బాలబాలికలకు..**

**లాంఛనంగా ప్రారంభించిన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్**

**రాజమండ్రిలో మళ్ళీ పురాతన రెజ్లింగ్ క్రీడకు జీవం పోయాలి:వక్తల ఆకాంక్ష**



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్,ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు శనివారం రాజమండ్రి సమీపంలోని ఎస్.వి.పి.వి. కల్యాణ మండపంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-15,అండర్ -20 బాలుర బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ కుస్తీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల నుంచి 350 మంది రెజ్లర్స్ హాజరయ్యారు. ఈ పోటీలను శనివారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ రొటేరియన్ తీగెల రాజా అధ్యక్షతన జరిగిన సభలో జి.ఎస్.ఎల్.ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు,ఏపి అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, కార్యదర్శి వెంకటరమణ,జిల్లా కార్యదర్శి ఎలీషా రావు,ఐకాన్స్ రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ ఇమ్మని వెంకట్, కార్యదర్శి సురేష్ ఉదయగిరి, ఉపాధ్యక్షుడు వెంకన్న బాబు, కోశాధికారి కామేశ్వరీదేవీ, స్పోర్ట్స్ చైర్మన్ మద్దూరి శంకర్, గ్రంధి రాజా,రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహరావు, కల్యాణ మండపం అధినేతలు బూరుగుపల్లి రామారావు, బూరుగుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ ఉత్తరాదిలో రెజ్లింగ్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని, ఈ క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయని చెప్పారు.ఏపీలో ఈ పురాతన రెజ్లింగ్ క్రీడకు మళ్ళీ జీవం పోయాలని ఆకాంక్షించారు. తూర్పుగోదావరిజిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎలీషా రావు మాట్లాడుతూ రాజమండ్రిలో ఒకప్పుడు మాదిరెడ్డి చెన్నకేశవవరావు కుస్తీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ చాంపియన్ అయ్యారని ఆనాడు ఇక్కడ తాలింఖానాలు ఉండేవని ఎందరో కుస్తీ క్రీడాకారులు మట్టిలో కుస్తీలు పట్టేవారని తెలిపారు. ఇప్పుడు మేట్ మీద రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తాలింఖానాలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో విద్యార్థులను మళ్ళీ రెజ్లర్స్ గా తీర్చిదిద్దుతామని చెప్పారు.


# బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విద్యతోనే ఏ సమస్యనైనా అధిగమించగలమని దృఢ సంకల్పంతో భారతదేశ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాలులో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి ప్రసన్న శ్రీ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించిన జగ్జీవన్ రామ్ భారతీయ స్వాతంత్ర్య కార్యకర్తగా, స్వాతంత్ర అనంతరం సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా పనిచేశారన్నారు. విద్యతోనే ఆయన ఉన్నత పదవులను అధిరోహించి వాటికి వన్నె తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ జయంతి జార్జి రెడ్డి వర్ధంతి సభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏజెన్సీ టైగర్ కీర్తిశేషులు ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి మరియు మేడా మహామిత్ర మండలిల సంయుక్తా ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరంలో నిర్వహించ తలపెట్టిన నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు మరియు విద్యార్థినేత జార్జి రెడ్డి 53వ వర్ధంతి సభల ఆహ్వాన పత్రాన్ని సీనియర్ న్యాయవాద దంపతులు రావిపాటి రాధాకృష్ణ,కేటీవిఆర్ స్వర్ణలతలు శుక్రవారం మధ్యాహ్నం రాజమండ్రి బార్అసోసియేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. న్యాయవాదులు సుంకర వెంకట భాస్కర రంగారావు, బండారు గాయత్రి జీవన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్నపూర్ణమ్మ పేట నాయి బ్రాహ్మణ భవనం వద్ద శ్రీరాముని రాట ముహూర్తం..

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



శనివారం ఉదయం అన్నపూర్ణం పేట పెద్దవీధి నాయి బ్రాహ్మణ రామాలయ కమ్యూనిటీ భవనం నందు రాజమండ్రి నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం మరియు రామ భవన కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణం మహోత్సవమునకు రాట ముహూర్తం పెళ్లి కుమారుడిని పెళ్లి కూతుర్ని చేయటం జరిగినది ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అలాగే ఆదివారం నాడు జరిగే రాముల వారి కళ్యాణానికి పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలములు స్వీకరించవలసిందిగా కోరడమైనది ఇట్లు రాజమండ్రి నాయి బ్రాహ్మణ రామభవన కమిటీ జయంతి

# పంత్‌కు రూ.12 లక్షలు

## రెండోసారి దిగ్వేశ్‌కు భారీ జరిమానా!

ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు షాక్ తగిలింది. ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషభ్ పంత్‌తోపాటు యువ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠికి జరిమానా విధిస్తూ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ నిర్ణయం తీసుకుంది. లఖ్‌నవూలోని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఏకనా స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. పంత్‌కు రూ.12 లక్షలు జరిమానా విధించగా.. యువ బౌలర్ దిగ్వేశ్ వరుసగా రెండోసారి ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఆగ్రహానికి గురికావడం గమనార్హం.



### అంచనాలు ఎక్కువ.. ఆట తక్కువ!

"లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సారథి రిషభ్ పంత్‌కు జరిమానా విధించాం. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆర్టికల్ 2.22 ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించాం" అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ తెలిపింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా జరిమానా ఎదుర్కొన్న మూడో సారథి రిషభ్ పంత్. ఇంతకుముందు హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్‌పై ఫైన్ పడింది.

### దిగ్వేశ్ ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు

ముంబయిపై లఖ్‌నవూ విజయం సాధించడంలో దిగ్వేశ్ రాఠి కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్ల స్పెల్‌లో ఒక్క వికెట్ తీసి 21 పరుగులు మాత్రమే ఇచ్చాడు. కీలకమైన నమన్ ధీర్ (46)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో అతడికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. అయితే, నమన్‌ను ఔట్ చేసిన తర్వాత కూడా 'సంతకం' చేసినట్లుగా సంబరాలు నిర్వహించడంపై మ్యాచ్ రిఫరీ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 2.5 కోడ్ ఆఫ్ కండక్ట్ లెవెల్ 1 నేరం కిందకు వస్తుందని.. దీంతో అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించినట్లు కమిటీ వెల్లడించింది. ఇప్పటికే పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లోనే ఇలానే వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఒక డీమెరిట్ పాయింట్ వచ్చింది. ఇప్పుడీ ఘటనతో మరో రెండు డీమెరిట్ పాయింట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అతడి ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు ఉన్నట్లైంది.

# తిలక్ వర్మ 'రిటైర్డ్ ఔట్' నిర్ణయం సూర్యకుమార్‌కు నచ్చలేదా?

భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో తిలక్ వర్మ అద్భుతంగా ఆడాడు. తిలక్ కోసం మూడో స్థానాన్ని కూడా త్యాగం చేశాడు. దీంతో ప్రపంచంలోనే నంబర్ - 2 ర్యాంక్‌కు చేరాడు. ఐపీఎల్‌లోనూ ముంబయి ఇండియన్స్ తరఫున కీలక ఇన్నింగ్స్ ఆడిన క్రికెటర్. కానీ, లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో మాత్రం అతడిని 'రిటైర్డ్ ఔట్'గా ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ నిర్ణయంపై ఇప్పటికే కెప్టెన్ హార్దిక్ పాండ్య వివరణ ఇచ్చాడు. కానీ, సూర్యకుమార్ యాదవ్‌కు మాత్రం ఆ నిర్ణయం నచ్చలేదని అతడి రియాక్షన్‌ను బట్టి తెలుస్తోంది. అయితే, జయవర్ధనె వెళ్లి సూర్యకు నచ్చజెబుతూ ఉన్న వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ హాఫ్ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. తిలక్ వర్మ 23 బంతుల్లో 25 పరుగులు మాత్రమే చేశాడు. అతడికి బదులు మిచెల్ సాంట్నర్‌ను ఆడించినా ముంబయికి ఓటమి మాత్రం తప్పలేదు.



### కోచ్ వివరణ ఇదీ..

తిలక్ వర్మ ఎపిసోడ్‌పై ముంబయి కోచ్ జయవర్ధనె కూడా స్పందించాడు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను వెల్లడించాడు. "తిలక్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లోనూ సూర్యతో కలిసి మంచి భాగస్వామ్యం నిర్మించాడు. దూకుడు పెంచాలని చూసినా కుదరలేదు. కొన్ని ఓవర్ల వరకూ వేచి చూశాడు. హిట్టింగ్ చేసేందుకు ప్రయత్నించినా సఫలం కాలేదు. దీంతో అతడిని అక్కడికి ఆపి కొత్తగా ఎవరినైనా పంపించాలని నిర్ణయించాం. ఎందుకంటే ఇబ్బందిపడుతూ ఉన్నప్పుడు ఒత్తిడి పెంచకూడదు. క్రికెట్‌లో ఇవన్నీ సహజంగానే జరుగుతుంటాయి. అతడిని ఔట్‌గా ప్రకటించడం నాకూ ఇష్టం లేదు. జట్టు వ్యూహంలో భాగంగా చేయాల్సి వచ్చింది" అని జయవర్ధనె వెల్లడించాడు.

### పాండ్య పరిస్థితులకు తగ్గట్టుగా..

" హార్దిక్ పాండ్య బౌలింగ్ బాగుంది. ఎక్కడ స్లో బంతులు వేయాలి. ఎలాంటప్పుడు లెంగ్త్‌తో సంధించాలనేది తెలుసు. పవర్‌ప్లేలో మేం అదనంగా పరుగులు ఇచ్చాం. బంతిని వేగంగా వేసేందుకు ప్రయత్నించడం వల్లే ఇలా జరిగింది. పాండ్య తన అనుభవంతో బౌలింగ్ చేశాడు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఫలితం రాబట్టాడు. అతడి వల్ల లఖ్‌నవూ భారీ స్కోరు చేయకుండా అడ్డుకోగలిగాం" అని కోచ్ తెలిపాడు.

# దిల్లీతో మ్యాచ్.. సీఎస్కే తరఫున యువ ఓపెనర్ ఎంట్రీ?

ఐపీఎల్ 2025 సీజన్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుసగా రెండు ఓటములు ఎదురయ్యాయి. ఇప్పుడు మళ్లీ సొంత మైదానం చెపాక్‌లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో పైకి రావాలనే లక్ష్యంతో సిద్ధమవుతోంది. ఇప్పటికే ధోనీ మళ్లీ సారథ్యం బాధ్యతలు చేపడతాడని వార్తలు వచ్చాయి. రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశం లేదు. దీంతో దిల్లీ క్యాపిటల్స్‌తో పోరుకు తాత్కాలికంగా ధోనీ కెప్టెన్సీ నిర్వహిస్తాడని సమాచారం. అయితే, రుతురాజ్ గైర్హాజరు కావడంతో బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు చేసే అవకాశం లేకపోలేదు.

### వన్‌డౌన్‌లోకి త్రిపాఠి

గత మూడు మ్యాచుల్లోనూ రుతురాజ్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ త్రిపాఠి మాత్రం ఇక్కడ ఆకట్టుకోలేదు. దీంతో అతడిని వన్‌డౌన్‌లోకి పంపించి.. యువ ఆటగాడు 17 ఏళ్ల ఆయుష్ మాత్రేను ఓపెనర్‌గా పంపించాలని సీఎస్కే భావిస్తున్నట్లుంది. అప్పుడు రచిన్ రవీంద్రతో కలిసి ఆయుష్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. మరోవైపు ఈసారైనా ధోనీ ముందువరుసలోకి వస్తాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. అతడు కనీసం ఆరో స్థానంలోనైనా బ్యాటింగ్‌కు వస్తే



బాగుంటుందని ఇప్పటికే పలువురు మాజీలు సూచించారు. శివమ్ దూబెపై మరోసారి నమ్మకం ఉంచే అవకాశం ఉంది. గత మ్యాచుల్లో అతడు స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేదు. స్పిన్ కీలకంగా మారే చెన్నై పిచ్‌పై సీఎస్కే నూర్ అహ్మద్, రవీంద్ర జడేజా, అశ్విన్‌తో బరిలోకి దిగడం ఖాయమే. రచిన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ ఎలానూ ఉన్నాడు. పేసర్ జేమీ ఓవర్టన్ పవర్‌ప్లేలో భారీగానే పరుగులు ఇచ్చాడు. దీంతో అతడిని పక్కన పెట్టి సామ్ కరన్‌ను మళ్లీ తీసుకొనే ఆలోచనలో సీఎస్కే ఉన్నట్లు తెలుస్తోంది.

# నూర్ ప్రత్యేకత అదే

**చెన్నై:**
లెగ్ స్పిన్ చేస్తూ వేగంగా బంతిని విసరడం అఫ్గానిస్థాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రత్యేకతని.. ఈ బంతులను ఎదుర్కోవడం బ్యాటర్లకు చాలా కష్టమని భారత చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ అన్నాడు. ఈ ఐపీఎల్‌లో చెన్నైకి ప్రాతినిధ్యం వహిస్తున్న నూర్.. 3 మ్యాచ్‌ల్లోనే 9 వికెట్లు తీశాడు. ఈ సీజన్లో అత్యధిక వికెట్ల వీరుడు అతనే. పరుగుల వరద పారుతున్న ఈ ఐపీఎల్‌లో అతడి ఎకానమీ 6.83 మాత్రమే కావడం విశేషం. ఈ నేపథ్యంలో కుల్‌దీప్ మాట్లాడుతూ.. "నూర్ చక్కగా బౌలింగ్ చేస్తున్నాడు. అతడు ప్రతి ఒక్కరి దగ్గర నుంచి నేర్చుకుంటూ ఉంటాడు. నాతో కూడా ఇటీవలే లెగ్ స్పిన్ గురించి చాలాసేపు మాట్లాడాడు. బంతిని తిప్పుతూ వేగంగా విసరడం వల్ల అతడిని ఎదుర్కొని పరుగులు సాధించడం చాలా కష్టం. ముఖ్యంగా చెన్నై పిచ్‌పై నూర్ లాంటి మణికట్టు స్పిన్నర్‌ను ఆడడం పెద్ద సవాల్" అని ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కుల్‌దీప్ తెలిపాడు. గత ఏడాదిగా వరుణ్ చక్రవర్తి కూడా సత్తా చాటుతున్నాడని కుల్‌దీప్ అన్నాడు. "2024 నుంచి వరుణ్ గొప్పగా రాణిస్తున్నాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు" అని కుల్‌దీప్ పేర్కొన్నాడు. బంతిని స్పిన్ చేయడంపైనే బౌలర్లు దృష్టి పెట్టాలని కుల్‌దీప్ అన్నాడు. "మెరుగ్గా ఎలా బౌలింగ్ చేయాలో ఇప్పటికి నేర్చుకుంటూ ఉంటా. వీలైనంత స్పిన్ చేయడం ముఖ్యం. టీ20 క్రికెట్లో పరుగులు ఆపడమే కాదు వికెట్లు కూడా తీయాల్సి ఉంటుంది. ఇందుకోసం కఠోర సాధన తప్పదు" అని అతను చెప్పాడు.




# టైటిల్ పోరుకు హితేశ్

బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత క్రీడాకారుడు హితేశ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 70 కేజీల విభాగంలో అతడు ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం సెమీఫైనల్లో హితేశ్ 5-0తో మకాన్ ట్రార్ (ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. ఈ పోరులో ఆరంభంలో రక్షణాత్మకంగా ఆడిన హితేశ్.. తర్వాత ప్రత్యర్థిపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డాడు. మూడు రౌండ్లలోనూ అదే జోరు ప్రదర్శించి ట్రార్‌ను ఓడించాడు. ఫైనల్లో ఒడెల్ కమారా (ఇంగ్లాండ్)తో హితేశ్ తలపడనున్నాడు. 50 కేజీల్లో జదుమణి సింగ్‌కు చుక్కెదురైంది. సెమీస్‌లో అతడు 2-3తో ఆసియా అండర్-22 ఛాంపియన్ అసిల్‌బెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడిపోయాడు. విశాల్ (90 కేజీ), సచిన్ (60 కేజీ) కూడా ఇంటిముఖం పట్టారు. టురాబెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో విశాల్ 0-5తో ఓడగా.. పావెల్ బ్రాచ్ (పోలెండ్) చేతిలో సచిన్ అంతే తేడాతో పరాజయం పాలయ్యాడు.



# సారథ్యం లేకపోవడం తేలికగా ఉంది



**ముంబయి:**
ఇంగ్లాండ్ వన్డే, టీ20 సారథ్యం నుంచి తప్పుకున్నాక చాలా తేలికగా ఉందని గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ జోస్ బట్లర్ అన్నాడు. మనసు ప్రశాంతంగా ఉండడంతో ఈ అవకాశాన్ని ఐపీఎల్‌లో పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపాడు. "కచ్చితంగా తేలిక భావం కలుగుతుంది. సారథిగా అనుకున్న ఫలితాలు రానప్పుడు చాలా భారంగా ఉంటుంది. దాన్ని సరిదిద్దడానికి ఎంతో సమయం, శక్తి వెచ్చించాల్సి వస్తుంది. సారథ్యం నుంచి విముక్తి లభించడంతో మానసికంగా ఒత్తిడి తగ్గిపోయింది. చాలా ప్రశాంతంగా ఉంది. నా సొంత ఆటపై దృష్టిపెట్టగలుగుతున్నా" అని బట్లర్ చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ ఘోర వైఫల్యం నేపథ్యంలో బట్లర్ గత నెల కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న రష్మిక అడిషన్ వీడియో



రష్మిక మందన్నా, ప్రస్తుత పాన్ ఇండియా స్థాయిలో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరు. కర్ణాటకకు చెందిన ఈ ముద్దుగుమ్మ, మోడలింగ్ రంగం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అతి తక్కువ సమయంలోనే తాను ఇండస్ట్రీలోకి వచ్చేందుకు చేసిన కృషి ఆమె తొలి అడిషన్ వీడియో నుంచే తెలుస్తోంది. కిరిక్ పార్టీ సినిమాతో కన్నడలో పరిచయమైన రష్మిక అదే సినిమా ద్వారా తన అభినయ సామర్థ్యాన్ని చాటింది.

%కిరిక్ పార్టీ సినిమా సమయంలో ఆమె డిగ్రీ చదువుతోంది. అదే సమయంలో ఆమెకు సినిమా ఛాన్స్ రావడం, ఆ ఛాన్స్‌ను వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవడం ఆమె విజయం మొదటి పాఠం. ఈ సినిమా తర్వాత తెలుగులో "ఛలో" సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తర్వాత విజయ్ దేవరకొండ సరసన "గీత గోవిందం" చిత్రంలో నటించి, ప్రేక్షకుల మనసు దోచుకుంది. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి, ఎంతో కష్టపడి స్టార్ హోదా సంపాదించిన ఈ నటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది. సాధారణమైన అమ్మాయి, మోడల్‌గా, యాక్ట్రెస్‌గా, నేషనల్ క్రష్‌గా, ఇప్పుడు పాన్ ఇండియా స్టార్‌గా మారిన రష్మిక .

**పుష్ప మూవీతో వెలుగులోకి**

రష్మిక ఫేమ్‌కు రాకెట్ బూస్ట్ ఇచ్చిన సినిమా "పుష్ప". అల్లు అర్జున్ సరసన నటించిన ఈ చిత్రంలో ఆమె శ్రీవల్లి పాత్రలో నటించి, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ పాత్ర ద్వారా ఆమెకు హిందీ ఇండస్ట్రీలో కూడా గుర్తింపు వచ్చింది. అంతే కాదు ఆమె డ్యాన్స్, డైలాగ్ డెలివరీ, నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. మిషన్ మజ్నూ, గుడ్ బై వంటి హిందీ చిత్రాల్లో నటించిన రష్మిక తాజాగా రణబీర్ కపూర్ సరసన యానిమల్ చిత్రంలో నటించి, మరోసారి ప్రేక్షకులను మెప్పించింది. ఆ సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఆమెకు బాలీవుడ్‌లో కూడా స్థానం ఏర్పడింది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ తన సత్తా చాటుతున్న రష్మిక, ప్రస్తుతం అత్యంత బిజీ హీరోయిన్‌గా పేరు సంపాదించింది. నటనతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, సోషల్ మీడియా ఆక్టివిటీ లలోనూ రష్మిక టాప్ ప్లేస్‌లో ఉంది. రష్మిక నటించిన తాజా చిత్రం సికందర్. ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయింది. అయితే ఆమె నటనపై మాత్రం మంచి స్పందన వచ్చింది. రష్మిక ఈరోజు (ఏప్రిల్ 5) తన 29వ పుట్టినరోజు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా అభిమానులు, సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆమె పాత ఫోటోలు, వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఆమె తొలి అడిషన్ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ వీడియోలో రష్మిక మొదటి డైలాగ్ చెప్పడానికి భయపడుతూ ఉండడం, స్వల్పంగానే అయినా తలవంచి ఇబ్బంది పడిన హావభావాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే అదే భయపడే అమ్మాయి ఇప్పుడు ఇండస్ట్రీని ఏలుతోంది అంటే ఆమె కష్టం, పట్టుదల స్పష్టంగా తెలుస్తుంది.



# 7/జీ బృందావన్ కాలనీ

# సీక్వెల్ అప్డేట్

2004లో విడుదలై యూత్‌ను హత్తుకున్న ఒక ప్రత్యేకమైన సినిమా.. అదే 7/జీ బృందావన్ కాలనీ. తమిళనాడులోనే కాదు, తెలుగులోనూ ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపించింది. దర్శకుడు సెల్వరాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ప్రతి క్షణంలోనూ న్యాచురల్ ఎమోషన్స్‌తో నిండిపోయి, అప్పటి యూత్‌కు పర్సనల్‌గా కనెక్ట్ అయ్యింది. ముఖ్యంగా కథ, కథనాలు, పాత్రల ప్రొఫైల్, యువన్ శంకర్ రాజా సంగీతం ఎ అన్నీ కలిపి ఈ సినిమాను ఒక క్లాసిక్‌గా నిలిపాయి.

**పార్టు 2పై భారీ అంచనాలు %-% సెల్వ బిగ్ అప్డేట్**

ఇప్పటికే ఈ సినిమాకు సీక్వెల్ వస్తుందన్న వార్తలపై ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక తాజాగా దర్శకుడు సెల్వరాఘవన్ అధికారికంగా క్లారిటీ ఇచ్చారు. "ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా ఈ సీక్వెల్‌ను రూపొందిస్తున్నాం. ఇప్పటికే 50% షుటింగ్ పూర్తయ్యింది. మొదటి భాగం ముగిసిన దగ్గర నుంచి కథ ప్రారంభమవుతుంది. కదీర్‌కు ఉద్యోగం వచ్చాక, ఒంటరిగా జీవితం ఎలా సాగిందన్నది ప్రధాన కోణం" అని సెల్వ తెలిపారు. పార్ట్ 1లో కథ ఎమోషనల్ క్లైమాక్స్‌తో ముగిసింది. కదీర్ తన ప్రేమను కోల్పోయి, జీవితంలో ఒంటరిగా మిగిలాడు. ఇప్పుడు పార్ట్ 2లో ఆ ఇమోషన్‌ను కొనసాగిస్తూ, అతడి దైనందిన జీవితంలోని మలుపులను చూపించనున్నారు. అతడి ఉద్యోగ జీవితం, ఒంటరితనాన్ని తట్టుకునే విధానం, గతపు గుర్తులు వదలుకోలేకపోవడం – ఇవన్నీ కథలో కీలకంగా నిలవనున్నాయి. సెల్వ మాటల ప్రకారం, "పార్ట్ 1లోనే సీక్వెల్‌కు క్లూ ఇచ్చాం" అని చెప్పారు.

**సినిమా చిన్నది కాదు - భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది**

ఇప్పటి రోజుల్లో చిన్న సినిమాలకే థియేటర్లలో చోటు లభించడం కష్టమని సెల్వరాఘవన్ అభిప్రాయపడ్డారు. అందుకే ఈ సినిమాను హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ ఇవ్వడం మరో హైలైట్‌గా నిలుస్తుంది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటల మాజిక్ ఈ చిత్రంలో మళ్లీ రెట్టింపు కానుంది.

**'యుగానికి ఒక్కడు 2'పై కూడా ఆసక్తికర సమాచారం**

ఈ సందర్భంగా మరో క్రేజీ ప్రాజెక్ట్ గురించి కూడా సెల్వ మాట్లాడారు. అదే యుగానికి ఒక్కడు సీక్వెల్. "ఈ సినిమాకు సీక్వెల్ చేయాలన్నది నా కోరిక. కానీ ముందుగానే ప్రకటించడం వల్ల కొంత ఒత్తిడి వచ్చింది. ఈ కథ చాలా క్లిష్టమైనది. బడ్జెట్ కూడా భారీగా కావాలి. ప్రొడ్యూసర్‌తో పాటు ధనుష్, కార్తిల డేట్స్ కూడా సంవత్సరంపాటు కావాలి" అని సెల్వ వెల్లడించారు.

**ప్రేక్షకుల భావోద్వేగాలను స్పృశించేలా సిద్ధమవుతోన్న కథనం**

'7జీ బృందావన్ కాలనీ 2' కేవలం ప్రేమ కథ కాదు ఇది ఓ తరానికి ప్రతిబింబం. జీవితం, బాధ, ఒంటరితనం, ఆశలు, జ్ఞాపకాలు అన్నీ కలిపే కథనం. యథార్థాన్ని అద్దం పట్టే విధంగా, ప్రతి మనిషి జీవితంలోని మూమెంట్స్‌కి అనుసంధానమయ్యేలా తెరకెక్కిస్తున్నారు. మళ్లీ 20ఏళ్ల తరువాత అదే పాత్రలు, అదే కదలికలు చూడటం అభిమానులకు ఓ ఎమోషనల్ జర్నీగా మారనుంది.

**సెల్వర్ఘవన్ స్టైల్‌లో మళ్ళీ పాత జ్ఞాపకాల మునిగితేలుడు**

సెల్వర్ఘవన్ సినిమాలకు ప్రత్యేకమైన ఫీల్ ఉంటుంది. ఆయన కథన శైలి, మానసిక స్థితులపై పెట్టే ఫోకస్, పాత్రల అంతర్మథనాలు ఇవన్నీ ప్రేక్షకులకు జీవించిందిలా అనిపించేలా ఉంటాయి. 7జీ 2 కూడా అలాంటి మరో ఎమోషనల్ రోలర్‌కోస్టర్ అవుతుందనడంలో సందేహమే లేదు.

**సీక్వెల్‌తో పాత తరం %-% కొత్త తరం కలయిక**

ఈ సినిమా పాత తరం యువత కోసం ఒక నాస్టాల్జియా, కొత్త తరం కోసం ఒక జీవన పాఠం లా ఉండబోతుంది. ప్రేమలో పడిన వారు, బ్రేకప్ అనుభవించిన వారు, జీవితంలో ఒంటరితనం ఎదుర్కొన్న వారు అందరూ ఈ కథలో తమని తాము చూసుకుంటారు. ఇదే ఈ సినిమాకు స్పెషాలిటీ.ప్రస్తుతం షుటింగ్ శరవేగంగా సాగుతోంది. రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. మైత్రి మూవీ మేకర్స్ వంటి పెద్ద నిర్మాణ సంస్థలు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపే అవకాశం ఉంది.

# హోమ్ టౌన్ వెబ్ సిరీస్ రివ్యూ



ఈ మధ్య 90ల నాటి నేపథ్యంలో వస్తున్న వెబ్ సిరీస్‌లకు ప్రేక్షకుల నుంచి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. '90 ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వంటి సిరీస్ ప్రేక్షకుల మనసులను గెలుచుకోవడంతో, అదే తరహా నుంచి వచ్చిన మరో సిరీస్ 'హోమ్ టౌన్' కూడా నిన్నటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. మొత్తం ఐదు ఎపిసోడ్స్‌లో రూపొందిన ఈ సిరీస్ ప్రేక్షకులకు ఎంతవరకు కనెక్ట్ అయ్యిందో చూద్దాం. ఒక ఫోటో స్టూడియోతో తన మిడిల్ క్లాస్ లైఫ్ ని ప్రసాద్ (రాజీవ్ కనకాల) తన భార్య (ఝాన్సీ) అలాగే పిల్లలు శ్రీకాంత్ (ప్రజ్వల్ యద్మ) అలాగే తన చెల్లెలు జ్యోతి (ఆనీ) లని వచ్చే తక్కువపాటి మొత్తం తోనే కుటుంబాన్ని నెట్టుకొస్తారు. అయితే శ్రీకాంత్ కి సరిగా చదువు ఎక్కదు కానీ కూతురు మాత్రం బాగా చదువుతుంది. అయితే వీరి అందరి నడుమ డ్రామా ఎలా సాగింది? జ్యోతి విషయానికి వచ్చేసరికి, మంచి సంబంధం చూసి పెళ్లి చేసి పంపించాలనే ఆలోచనలో ప్రసాద్ ఉంటాడు. అయితే జ్యోతికి పై చదువులు చదువుకోవాలని ఉంటుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలిసి ఆ మాటను పైకి చెప్పలేకపోతుంది. ఎప్పుడు చూసినా జగదీశ్, శాస్త్రి అనే ఫ్రెండ్స్ తో తిరిగే శ్రీకాంత్, చదువు విషయంలో ఎప్పటికప్పుడు వెనకబడుతూ ఉంటాడు. సినిమా డైరెక్టర్ కావాలనే కోరిక అతనిలో బలంగా ఉంటుంది.తన మనసులోని మాటను తండ్రికి చెప్పడానికి భయపడిన శ్రీకాంత్, చదువు విషయంలో తల్లిదండ్రులను మోసం చేస్తూ వస్తుంటాడు. అది తెలియని ప్రసాద్ అతణ్ణి విదేశాలకు పంపించడానికి తగిన ఏర్పాట్లు చేస్తూ ఉంటాడు. అతను తన కొడుకును విదేశాలకు పంపించగలుగుతాడా? అనుకున్నట్టుగా జ్యోతి పెళ్లి చేయగలుగుతాడా? ఒక మధ్యతరగతి తండ్రిగా అతను సక్సెస్ అవుతాడా? అనేది మిగతా కథ. ఇటీవల 90స్ నేపథ్యంలో వచ్చిన పలు సినిమాలు, సిరీస్ తరహాలోనే దీనిలో కూడా కొన్ని మూమెంట్స్ 90స్ కిడ్స్ బాగా కనెక్ట్ అవుతాయి. అప్పటి కొన్ని కొన్ని సన్నివేశాలు అలాగే ఎమోషన్స్ ఈ సిరీస్ లో ఆకట్టుకుంటాయి అని చెప్పవచ్చు. మెయిన్ గా మొదటి మూడు ఎపిసోడ్స్ డీసెంట్ గా సాగాయి అని చెప్పవచ్చు. ఈ మూడింటిలో కూడా రెండో ఎపిసోడ్ మాత్రం మంచి హిలేరియస్ గా సాగుతుంది.ప్రతీ ఎపిసోడ్ లో డీసెంట్ ఎమోషనల్ ఎండింగ్ ఓకే అనిపిస్తుంది.ఇక ప్రజ్వల్ నీట్ పెర్ఫామెన్స్ ని అందించాడు. పలు ఎమోషనల్ సీన్స్ ని బాగా చేసాడు. ఇక వీరితో పాటుగా సీనియర్ నటులు రాజీవ్ కనకాల, ఝాన్సీలు తమ అనుభవాన్ని తమ పాత్రల్లో చూపించారు. మధ్య తరగతి కుటుంబ తల్లిదండ్రుల్లా తమ పిల్లల కోసం వారి భవిష్యత్తు కోసం తాపత్రయం పడే ఇనోసెంట్ తల్లిదండ్రుల్లా చాలా బాగా చేశారు. అలానే యువ నటి ఆనీ తన పాత్రలో బాగా ఒదిగిపోయింది. కొన్ని సన్నివేశాలు ఫ్లోలో వెళతాయి కానీ అందులో ఎమోషనల్ సీన్స్ బాగున్నాయి.







# తమిళ నటుడు రవికుమార్ కన్నుమూత


తమిళ, మలయాళ సినిమాల్లో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవి కుమార్ (71) చనిపోయారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చెన్నై వళచెరిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ప్రకటించారు. కేరళ త్రిసూర్‌కి చెందిన రవికుమార్.. 1975 నుంచి సినిమాలు చేస్తున్నారు. 'ఉల్లాస యాత్ర', 'అవరగళ్', 'సీబీఐ 5', 'పరమానందం' తదితర మలయాళ చిత్రాలు చేశారు. తమిళంలోనూ 'అల్లాఉద్దీన్ అద్భుత విళక్కుమ్', 'రమణ', 'ఆనంద రాగం' తదితర సినిమాలు చేశారు. చివరగా 2022లో 'వీట్ల విశేషమ్' మూవీలో నటించారు.

# మాధవన్ సినిమాలో శివానీ రాజశేఖర్



భారత ప్రముఖ ఇంజనీర్ జి.డి.నాయుడు జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా జిడి నాయుడు (జిడిఎన్). ఆర్.మాధవన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. కథానాయిక శివానీ రాజశేఖర్ కూడా ఇందులో నటిస్తున్నారు. ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు వంటి పేర్లు గడించిన గోపాలస్వామి దొరైస్వామి షార్ట్‌గా జిడి నాయుడు అని కూడా అంటారు. జిడిఎన్ పేరుతో తెరకెక్కుతున్న బయోపిక్‌కు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టైటిల్ లోగోను మేకర్లు విడుదల చేయగా సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్ అవుతోంది. ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జిడి నాయుడు కేవలం మూడోతరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్లలో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించటంతోపాటుగా డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు.

# 'సింగిల్' ఫస్ట్ సాంగ్ విడుదల



శ్రీవిష్ణు కథానాయకుడిగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవానా కథానాయికలు. వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసింది. 'శిల్పి ఎవరో.. ఈ శిల్పమెనుక..' అంటూ సాగే లిరిక్స్‌ను శ్రీమణి అందించారు. గీతా ఆర్ట్స్ అండ్ కాల్య ఫిల్మ్స్ బ్యానర్‌పై విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339